ఈనాడు ఖమ్మం
మంగళవారం సెప్టెంబరు 1, 2026

అమ్మకు కోతలే అధికం

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే

ఆందోళన కలిగిస్తున్న ప్రసవాల తీరు

ఖమ్మం జిల్లాలో ప్రసవాల తీరు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఆసుపత్రుల్లో సాధారణ కాన్పుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం ఆరోగ్య శాఖను ఆదేశించినా ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇవి ఎక్కువగా సహజ కాన్పులకు కాకుండా శస్త్రచికిత్సల (సిజేరియన్) వైపు మళ్లుతున్నాయి. తాజాగా ఖమ్మం జిల్లాకు సంబంధించిన 2025, 2026 ప్రసవాల గణాంకాలు ఈ వాస్తవాన్ని కళ్లకు కడుతున్నాయి.

ఈ గణాంకాలే సాక్ష్యాలు..

జిల్లాలో ప్రసవాల్లో సిజేరియన్ల సంఖ్య పెరిగిపోయింది. 2025లో 5553 సాధారణ ప్రసవాలు, 11,327 సిజేరియన్లు జరిగాయి. 2026 జులై వరకు సాధారణ కాన్పులు 2797, సిజేరియన్లు 5982 నమోదయ్యాయి. ఈ గణాంకాలను పరిశీలిస్తే మొత్తం ప్రసవాల్లో 80 శాతానికి పైగా సిజేరియన్లే కావడం గమనార్హం. ఈ ఏడాది జులై వరకు ప్రైవేటు ఆసుపత్రుల్లో కేవలం 740 సాధారణ ప్రసవాలే జరగడం ఆరోగ్య శాఖ పర్యవేక్షణ లోపాన్ని ఎత్తి చూపుతుంది.

ప్రసవాలు ఇలా..	ప్రభుత్వ	ప్రైవేట్	ప్రభుత్వ	ప్రైవేట్
	సాధారణ		సిజేరియన్	
2025	3962	1591	4493	6834
2026 జులై	2057	740	2703	3279

తల్లీ పిల్లలకు ఇబ్బందే..

సిజేరియన్లతో తల్లీబిడ్డల ఆరోగ్యానికి దీర్ఘకాలంలో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. మాతృమూర్తులకు సాధారణ ప్రసవాల ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి. నర్సులకు నర్స్ ప్రాక్టీషనర్స్ ఇన్ మిడ్‌వైఫరీ శిక్షణ కొనసాగించాలి. వ్యాయామాలు చేయించడం, గర్భిణులకు ధైర్యం కల్పిస్తూ సహజ ప్రసవాలు పెరిగేలా చూడాలి. సిజేరియన్లకు అడ్డుకట్ట వేయకపోతే భావితరాల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

ప్రభుత్వ సిజేరియన్లలో అత్యవసర కేసులు, రెండో కాన్పులే ఎక్కువగా ఉంటున్నాయి. ప్రైవేటులో ఉద్దేశపూర్వకంగా సిజేరియన్లు చేస్తే చర్యలు తప్పవు. గర్భిణుల కుటుంబ సభ్యుల ఆలోచనల్లో కూడా మార్పు రావాలి. ఆరోగ్య శాఖ తరపున బర్త్ ప్లాన్ రూపొందించి మిడ్‌వైఫరీ సేవలందిస్తూ సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తున్నాం.
- డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారి

కారణాలెన్నో..

- ఎక్కువ బిల్లులు వసూలు చేయవచ్చనే కోణంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యులు సాధారణ ప్రసవాల కంటే సిజేరియన్లకు ప్రాధాన్యమిస్తున్నారు.
- ఓపిక లేకపోవడం, ప్రసవ వేదనను భరించడానికి సిద్ధంగా లేకపోవడం కారణాలుగా ఉంటున్నాయి. నొప్పులు లేకుండా సులువుగా డెలివరీ అయిపోతుందనే అపోహతో స్వయంగా సిజేరియన్‌ను ఎంచుకుంటున్నారు.
- పిల్లలు ఫలానా రోజు, నక్షత్రంలో పుట్టాలని తల్లిదండ్రులు ముందుగానే ప్లాన్ చేసుకొని ఆ సమయానికి కచ్చితంగా ఆపరేషన్ ద్వారా పిల్లలను కనాలనే భావనలో ఉంటున్నారు.
- తగినంత శారీరక శ్రమ లేకపోవడం, పోషకాహార లోపం, అనారోగ్య సమస్యలతో సిజేరియన్లు అనివార్యం అవుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

మేము ఇంకా రేషన్ బియ్యం తీసుకోలే!

5 వరకు ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతి

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో ఇప్పటికీ కొందరు రేషన్ బియ్యం తీసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల ఆగస్టులో ఒకేసారి మూడు నెలల రేషన్‌ను ఇవ్వడంతో ఎప్పుడు చూసినా చౌక ధరల దుకాణాల ఎదుట జనం బారులుదీరి కనిపించారు. దుకాణాల వద్ద రెండు మూడు సార్లు వేచి ఉన్నా తమకు బియ్యం అందలేదని, ఆగస్టు 31తో గడువు ముగుస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గోపాలపురం రేషన్ దుకాణం వద్ద సోమవారం స్థానికులు బియ్యం కోసం పెద్ద ఎత్తున గుమిగూడారు. దుకాణంలో 40 క్వింటాళ్ల బియ్యం ఉన్నాయని రేషన్ డీలర్ చెప్పారు. అయితే బియ్యం అందని వారు ఎక్కువ మంది ఉండటంతో సెప్టెంబరు 5 వరకు బియ్యం ఇచ్చేందుకు ప్రభుత్వం అనుమతించిందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని రేషన్ డీలర్లు తెలిపారు.

క్రీడా వేదికల్లో కీచక పర్వాలు

నిఘా

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

ఆసక్తి చూపుతున్నారని ఆటల్లో ప్రోత్సహించేందుకు మైదానాలకు వచ్చే తల్లిదండ్రులు, పిల్లలకు రక్షణ కొరవడుతోంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ నగరంలో ఓ షూటింగ్ శిక్షకుడి అకృత్యాల కారణంగా మొత్తం కుటుంబమే ఆత్మహత్య చేసుకున్న ఉదంతం కలకలం రేపింది. తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలని, సమస్య అనిపిస్తే ఆదిలోనే ఫిర్యాదు చేయాలని క్రీడాధికారులు, ఆ రంగ నిపుణులు సూచిస్తున్నారు.

అదను చూసుకొని..

శిక్షణ కేంద్రాలకు వచ్చే కొందరు తమ పిల్లలను ప్రత్యేకంగా చూడాలనే నేపథ్యంలో తల్లిదండ్రులు శిక్షకులతో మాట్లాడుతున్నారు. ఈ అవకాశాలను కొందరు అదునుగా తీసుకుంటున్నారు. పిల్లలను రాష్ట్ర, జాతీయ పోటీలకు తీసుకెళ్లే సమయంలో సొంత ఖర్చులు పెట్టి ఎరవేస్తున్నారు. ఆ తర్వాత నిజ స్వరూపం బయటపెడుతున్న ఘటనలు ఉంటున్నాయి.

◆ కొందరు బాధితులు ధైర్యం చేసి ఫిర్యాదు చేస్తుండగా, మరికొందరు ప్రమాదాన్ని పసిగట్టి శిక్షణకు దూరంగా ఉంటున్నారు.

నిబంధనలు బేఖాతర్

క్రీడా రంగంలో ఆడపిల్లల భద్రత విషయంలో పలు ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. వాటిని చాలాచోట్ల పాటించడం లేదు. పాఠశాలల స్థాయి బాలికల క్రీడా జట్లతో ఓ మహిళా శిక్షకురాలు వెళ్లాలనే నిబంధన ఉంది. అధికారులు దీనిని పాటించడంలేదు.

ప్రత్యేక పర్యవేక్షణ అమలు చేస్తున్నాం

సునీల్‌రెడ్డి, జిల్లా యువజన, క్రీడాధికారి

గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సర్దార్ పటేల్ స్టేడియంలో కొన్ని చర్యలు చేపట్టాం. ప్రతీ క్రీడా ప్రాంగణం సీసీ నిఘా పరిధిలోకి తెచ్చాం. ప్రతి రోజు క్షుణ్నంగా పరిశీలిస్తున్నాం. శిక్షకులు సమయ పాలన పాటించేలా బయోమెట్రిక్ హాజరును అమలు చేస్తున్నాం. తల్లిదండ్రులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే రంగంలోకి దిగి చర్యలకు ఉపక్రమిస్తున్నాం. క్రీడాకారులు, వారి తల్లిదండ్రులకు జాగ్రత్తలు వివరిస్తున్నాం.

మన వద్దా కొన్ని ఘటనలు

■ భద్రాచలానికి చెందిన ఓ సీనియర్ క్రీడాకారుడికి శిక్షణ బాధ్యతలు అప్పగించారు. పోటీల్లో పాల్గొనేందుకు బాలికలతో వెళ్లిన అతను ఓ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. దాంతో అతన్ని ఉద్యోగం నుంచి తొలగించారు.

■ కొన్నేళ్ల క్రితం ఖమ్మంలో ఓ శిక్షకుడికి ఓ క్రీడాకారిణి తల్లితో చనువు పెరిగింది. అది కాస్త గొడవలకు దారి తీసింది. సదరు కోచ్ భార్య ప్రత్యక్షంగా పట్టుకొని దేహశుద్ధి చేసింది. అధికారులు ఆ కోచ్‌ను విధుల నుంచి తొలగించారు.

■ ఓ శిక్షకుడు తమను వేధిస్తున్నాడని క్రీడాకారిణి తల్లి రాత పూర్వకంగా జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. వారు తగు చర్యలు తీసుకున్నారు. నగరంలోని మరో క్రీడా శిక్షణ కేంద్రంలోనూ బాలికలపై వేధింపుల ఆరోపణలు వచ్చాయి.

ప్రజల నమ్మకమే నా రాజకీయ బలం

సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: ప్రజల నమ్మకమే తన రాజకీయ ప్రస్థానానికి బలమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఖమ్మం కార్పొరేషన్‌లో రూ.12 కోట్లతో నిర్మించనున్న రహదారి పనులకు మంత్రి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను రాజకీయాల్లోకి రావాలని అనుకోలేదని, ప్రజల ఒత్తిడి మేరకే రాజకీయాల్లో ఉన్నానని పేర్కొన్నారు. వారి ఆశీర్వాదంతోనే పదవులు దక్కాయని, ప్రజలు కోరుకుంటేనే కష్టమైనా, నష్టమైనా నామినేషన్లు వేస్తున్నానని అన్నారు. గత ఎన్నికల్లోనూ తాను ఖమ్మం నియోజకవర్గాన్ని కోరుకోలేదని, పార్టీ అధిష్ఠానం ఇక్కడకు పంపించినా ప్రజలు గుండెల్లో పెట్టుకొని గెలిపించారని స్పష్టం చేశారు.

◆ ఖమ్మం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శంగా నిలపడమే తన లక్ష్యమన్నారు. రహదారుల వెడల్పు ప్రజాభీష్టం మేరకే ఉంటుందని స్పష్టం చేశారు. నగరంలో మంచినీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.250 కోట్లు మంజూరు చేశారని, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణంతో 24 గంటల తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఖమ్మంలో శాంతిభద్రతలు ముఖ్యమని, పోలీసులు తమ పని తాము చేసుకోవాలని తుమ్మల చురకలు అంటించారు. కాంగ్రెస్ నేత సాధు రమేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సీపీ సునీల్‌దత్, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హనుంతరావు, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండీ ఖాదర్‌బాబా, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీ, నగర అధ్యక్షులు నూతి సత్యనారాయణగౌడ్, నాగండ్ల దీపక్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పార్టీ శ్రేణులు శ్రీనివాసనగర్ నుంచి మున్నేరు వంతెన వరకు ర్యాలీ నిర్వహించారు.

ఇంకా 33 శాతం లోటు వర్షపాతమే

పలు పంటలపై ప్రభావం

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

ఖమ్మం జిల్లాలో ఇప్పటికీ లోటు వర్షపాతమే ఉంది. దీనికితోడు భూగర్భజలాలు రోజురోజుకు అడుగంటిపోతున్నాయి. గత వారం రోజుల నుంచి అడపదడపా వానలు కురుస్తున్నా వర్షపాతం మాత్రం ఆశించిన స్థాయిలో మెరుగుపడలేదు. రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తున్నా.. వాటి పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండి, పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

ఒక్క మండలం తప్ప అన్ని చోట్ల..

జిల్లాలో లోటు వర్షపాతమే ఉంది. మండలాల వారీగా వర్షపాత రికార్డులో గణనీయమైన వ్యత్యాసం కనిపిస్తోంది. మొత్తం వానాకాలంలో ఇప్పటి వరకు 595.7 మి.మీ.లు సాధారణ వర్షపాతానికిగాను 401.8 మి.మీ. మాత్రమే నమోదైంది. అంటే 33 శాతంలోటు వర్షపాతం ఉంది. మండలాల వారీగా పరిస్థితి గమనిస్తే ఒక్క కల్లూరు మండలంలోనే సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగిలిన 20 మండలాల్లో లోటు వర్షపాతమే ఉంది.

అడుగంటుతున్న భూగర్భజలాలు

భూగర్భ జలాలకు ముఖ్య ఆధారం వర్షపాతమే. ఎర్రుపాలెం మండలంలో గత ఏడాది ఆగస్టులో 4.41 మీటర్లుగా ఉన్న భూగర్భజలాలు ఈ ఆగస్టుకు వచ్చే సరికి 10.55 మీటర్లకు పడిపోయాయి. సత్తుపల్లి మండలంలో 9.52 మీటర్ల నుంచి 12.39 మీటర్లకు, వేంసూరు మండలంలో 2.66 నుంచి 7.23 మీటర్లకు పడిపోయాయి.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

డి.పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

వర్షపాతాన్ని అనుసరించి పంటలు సాగు చేయాలి. ముఖ్యంగా సెప్టెంబరు వరకు ఉండే నైరుతి రుతుపవనాలతో వర్షం సూచనలు లేవని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో పంటల సాగులో యాజమాన్య పద్ధతులు అనుసరించాలి. బోరుబావుల సౌకర్యం ఉన్న రైతులు పంటల సాగుకు వినియోగ సామర్థ్యం పెంచేలా నీటిని పొదుపుగా వాడాలి. తుంపర్లు, బిందు సేద్యం వంటి సూక్ష్మనీటి పారుదల పద్ధతులను అవలంబించాలి. వీబీజీరామ్‌జీ పథకంలో భాగంగా సేద్యం కుంటలను ఏర్పాటు చేసుకోవాలి.

సర్‌లో 44.69 శాతం నోటీసులు జారీ

ఖమ్మం కలెక్టరేట్, న్యూస్‌టుడే

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 (సర్)లో భాగంగా ప్రచురితమైన ముసాయిదా ఓటర్ల జాబితాలో పేరు నమోదు కానివారితో పాటు అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. జిల్లాలోని 5 నియోజకవర్గాల్లో 1,57,854 మందికి నోటీసులు జారీ చేయాల్సి ఉండగా సోమవారం నాటికి 44.69 శాతం మందికి అందించారు. వారిని విచారించేందుకు ప్రత్యేకంగా అదనపు ఈఆర్‌ఓలను నియమించారు. ఖమ్మం నియోజకవర్గంలోనే అత్యధికంగా 80,663 మందికి నోటీసులు జారీ చేయాల్సి ఉంది. మ్యాపింగ్ కాని వారిలో చాలా మంది ఎక్కడున్నారో తెలియని పరిస్థితి నెలకొందని అధికారులు చెబుతున్నారు. వారికి నోటీసులు ఎలా ఇవ్వాలి? విచారణ ఎలా నిర్వహించాలో తెలియక తలపట్టుకుంటున్నారు. నోటీసుల విచారణకు జిల్లాలో కొత్తగా 89మంది అదనపు ఏఈఆర్వోలను నియమించారు.

◆ సెప్టెంబర్ 16 వరకు నోటీసులు జారీకి అవకాశం ఉంది. అక్టోబరు 15వరకు అభ్యంతరాలు పరిష్కరించి అదే నెల 19న తుది ఓటర్ల జాబితా వెల్లడిస్తారు.

నోటీసుల జారీ ఇలా.. (నియోజకవర్గాల్లో శాతాల వారీగా)

ఖమ్మం	40
పాలేరు	40.8
మధిర	38.4
వైరా	55.0
సత్తుపల్లి	63.9

ప్రాణం విలువ పట్టదా..!

మరమ్మతుల దృష్ట్యా ఖమ్మం గాంధీచౌక్ దారిలోని మధ్యగేటును వారం రోజులుగా మూసివేశారు. ఓ వైపు రైల్వే సిబ్బంది స్లీపర్ రెన్యూవల్ మరమ్మతులు చేస్తుండగా ఇంకోవైపు గేటులో నుంచి దూరి పట్టాలపై ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈనాడు, ఖమ్మం

16 మంది పోలీస్ అధికారులకు ప్రతిభా పురస్కారాలు

పురస్కారాలు పొందిన పోలీసు అధికారులను అభినందిస్తున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ప్రకటించిన రాష్ట్ర పోలీస్ సేవా పతకాల్లో ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో 16 మంది పోలీస్ అధికారులు సేవా పతకాలను పొందారు. వీరిలో 2026కు చెందిన 15 మంది, 2025కు చెందిన ఒకరు ఉన్నారు. అదనపు డీసీపీ బి.రామానుజం, హెడ్ కానిస్టేబుళ్లు వి.భిక్షపతి, కె.సూర్యప్రకాశ్‌రెడ్డి ఉత్తమ సేవా పతకాలను, ఎస్‌ఐ కె.నాగేంద్రరావు, ఏఎస్‌ఐలు ఎండీ హనీఫ్(2025), ఎన్.రామిరెడ్డి, బి.సుందర్‌రావు, ఏఆర్ఎస్‌ఐలు ఎండీ హలీమ్, జి.భాస్కరరావు, హెడ్ కానిస్టేబుళ్లు ఎం.వెంకటేశ్వర్లు, టి.హరిచరణ్‌సింగ్, షేక్ మదార్‌సాహెబ్, ఐ.ప్రభాకర్‌రావు, సీహెచ్ రామారావు, కానిస్టేబుళ్లు కృష్ణ, డి.సుశీల్‌కుమార్‌లు సేవా పతకాలను పొందారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ వారికి పతకాలను అందించి అభినందించారు.

ఉరుకులు.. పరుగులు

'అనామలీస్' ఓటర్ల విచారణలో ఎన్నో సాదకబాధకాలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

ఖమ్మం నియోజకవర్గంలో ఓటర్ల సమగ్ర ప్రత్యేక సవరణ(సర్) ప్రక్రియ ఓటర్లను ఉరుకులు పరుగులు పెట్టిస్తోంది.. అనామలీస్ జాబితాలో నోటీసులు అందుకుని ప్రస్తుతం విచారణకు హాజరైన క్రమంలో అవసరమైన పత్రాలు అందించడంలో చిక్కులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా నిరక్షరాస్యులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. నోటీసులు అందుకున్న వారు నిర్దేశిత తేదీల్లో పోలింగ్ కేంద్రాలకు హాజరవుతున్నారు. కొన్ని కేంద్రాల్లో తమ పేర్లు ఎవరు తప్పుగా నమోదు చేశారని, అక్షర దోషాలకు తమకు ఏంటి సంబంధమని ప్రశ్నిస్తున్నారు. నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను సోమవారం 'న్యూస్‌టుడే' పరిశీలించి ఇస్తున్న కథనం.

◆ నగరంలో టి.వెంకన్న అనే ఓటరు పేరు టి.వెంకటేశ్వర్లుగా జాబితాలో ఉండడంతో సర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ అనంతరం నోటీసు అందించారు. గతంలో ఓటు వేసిన సమయంలో ఎప్పుడూ అతనికి అభ్యంతరం ఎదురు కాలేదు. దీంతో వెంకన్నగా మార్చుకునేందుకు ప్రయత్నించలేదు. నిరక్షరాస్యుడైన సదరు ఓటరుకు ప్రస్తుతం నోటీసు రావడంతో ఆ రెండు పేర్లు తనవేనని ఎలా నిరూపించుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నాడు.

విచారణకు వచ్చిన ఓటరును ఫొటో తీస్తున్న బీఎల్వో

రెండుసార్లు ఫొటో తప్పనిసరి

నోటీసులు అందుకున్న సమయంలో, విచారణ సమయంలో ఫొటో తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాల్సి వస్తోంది. నోటీసులు ఎవరు తీసుకుంటే వారి ఫొటో, విచారణ సమయంలో వచ్చిన ఓటరు (నోటీసు అందుకున్న వారి రక్తసంబధీకులు) ఫొటో తప్పనిసరి చేయడంతో బీఎల్వోలకు, ఓటర్లకు ఇబ్బందిగా మారింది. అన్ని ఫొటోలను తమ వద్ద ఫోన్లలో అప్‌లోడ్ చేయలేకపోతున్నారు.

ఈనాడు పరిశీలన

వేధిస్తున్న నెట్‌వర్క్ సమస్య

పోలింగ్ కేంద్రాల్లో వేలాది మంది ఒకేసారి బీఎల్వో యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న తరుణంలో నెట్‌వర్క్ సమస్య తలెత్తుతోంది. బీఎల్వోల వద్ద ఫోన్లు ఇంతా డేటాను అప్‌లోడ్ చేసుకునే పరిస్థితి లేకపోవడంతో ఒక్కొక్క ఓటరుకు సంబంధించిన పత్రాలు, ఫొటోను అప్‌లోడ్ చేసేందుకు 10-20 నిమిషాలు పడుతోంది.

- కొందరు ఓటర్లు ఇంటి పేరు తప్పుగా నమోదు కావటంతో హాజరయ్యారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన పత్రాల్లో ఏది వారి వద్ద లేకపోవడంతో ఏ పత్రం అందించాలో తెలియక ఇబ్బందిపడ్డారు.
- స్వల్ప అక్షర దోషాలు ఉన్న వారు పెద్ద సంఖ్యలో విచారణకు హాజరవుతున్నారు. వీరు రెసిడెన్షియల్ లేదా కుల ధ్రువీకరణ ఏదో ఒకటి తప్పనిసరిగా చూపాల్సి వస్తోంది.
- బాధితుల్లో తండ్రి పేరులో తప్పుగా ఉన్నవారు ఎక్కువమంది ఉంటున్నారు.
- ఒక తండ్రికి ఆరుగురు బిడ్డలు ఉంటే మ్యాపింగ్ అయిదుగురికి మాత్రమే అవకాశం ఉంటోంది. 2002లో తండ్రి చిరునామాతో ఓటున్న మహిళలు వివాహ అనంతరం భర్తల చిరునామాలతో ఓట్లు పొందారు. ఒకే కుటుంబంలో ఇలాంటి వారు ఆరుగురు ఉంటే అయిదుగురికే మ్యాపింగ్‌కు అవకాశం ఉండటం గమనార్హం.

22ఏ భూములపై కసరత్తు

రెవెన్యూ రికార్డుల్లో సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో నమోదైన ప్రైవేట్ పట్టా భూములను గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా ప్రారంభించారు. జిల్లాలో 21 మండలాల్లోని తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, ఆర్ఐలు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సహా రెవెన్యూ ఉద్యోగులంతా సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. రెవెన్యూ విభాగాల్లోని కంప్యూటర్లన్నింటిని మండలాల వారీగా కేటాయించారు. మరికొందరు వెంట ల్యాప్‌ట్యాప్‌లు తెచ్చుకున్నారు. కలెక్టర్ దివాకర ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో 22ఏలో నమోదైన పట్టా భూముల వివరాలు తవ్వి తీస్తున్నారు. ఆయా మండలాలు, రెవెన్యూ గ్రామాల్లోని సర్వే నంబర్ల వారీగా భూమి వివరాలు గుర్తించి అందులో ప్రభుత్వ భూమి ఎంత, పట్టా భూమి ఎంత అనే లెక్కలపై కసరత్తు సాగిస్తున్నారు. ప్రభుత్వ భూమి, సీలింగ్ భూమి, వివిధ ప్రాజెక్టులు, ప్రజావసరాలకు సేకరించిన భూమి, ఎసైన్‌మెంట్ భూమి సహా వివిధ కేటగిరీల్లోని వివరాలు గుర్తించే పనిలో నిమగ్నం అయ్యారు. పొరబాటున 22ఏలో నమోదైన పట్టా భూములుంటే గుర్తించి వాటి జాబితా రూపొందించనున్నారు. ప్రైవేట్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.
– ఖమ్మం కలెక్టరేట్, న్యూస్‌టుడే

10వ వర్ధంతి



నిర్మలమైన మీ మనస్సు,
నిస్వార్థమైన మీ ఆశయాలు,
నిశ్చలమైన మీ గుండె ధైర్యం,
మా గుండెల్లో చెదరని
మీ చిరునవ్వు ఎప్పటికీ మాతోనే
ఉంటాయని, మీరే మాకు
మార్గదర్శి.. మీ జ్ఞాపకాలతో...
10వ వర్ధంతి
నివాళులర్పిస్తున్నాము..

కీ॥శే॥ కొల్లి రంగారావు గారు
మరణం: 01-09-2016
వ్యవస్థాపకులు: కిరణ్ ఏజన్సీస్, ఖమ్మం

భార్య: కొల్లి కమల

మనవళ్ళు - మనుమరాళ్ళు
దీప్తి - నితిన్
దివ్య - వరుణ్
వంశీ - పూజిత
రజిత - శ్రీధర్
వరుణ్ - ప్రవళిక
రవళి

కుమారులు - కోడళ్ళు
కీ॥శే॥ డా॥ కొల్లి రవిబాబు - కీ॥శే॥ డా॥ కొల్లి విజయ
కొల్లి కిరణ్‌బాబు - ఉషారాణి
కొల్లి అజయబాబు - విజయలక్ష్మి

మునిమనవళ్ళు, మునిమనుమరాళ్ళు
ఈశాన్వి, ఆర్యా, ఆరవ్, వియాన్, శరణ్, రియాన్ష్, క్రితిక్

స్టాఫ్: కిరణ్ ఏజన్సీస్, నెహ్రూనగర్, ఖమ్మం

మున్నేరు ముంచె.. పాలేరు తెంచె

రెండేళ్ల క్రితం ఉపద్రవం.. ఖమ్మంలో రూ.వెయ్యి కోట్ల నష్టం

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

సరిగ్గా రెండేళ్ల క్రితం మున్నేటి ఉగ్రరూపం నగరాన్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. పరీవాహక ప్రాంతాల ప్రజలు తేరుకునే లోపే వరద నీరు ఇళ్లలోకి చేరటంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని పరుగులు తీశారు. ఖమ్మం చరిత్రలో ముందెన్నడూ లేనిరీతిలో మున్నేరు నీటిమట్టం ఒక్కసారిగా 36 అడుగులకు చేరింది. ఒక్క నగర పరిధిలోనే రూ.వెయ్యి కోట్ల నష్టమని అంచనా. ప్రస్తుత పరిస్థితిపై విహంగ వీక్షణమీ కథనం.

- పూర్తిగా ఇళ్లు కోల్పోయిన వారి విషయంలో ప్రభుత్వ హామీ నేటికీ నెరవేరకపోవడంతో కొన్ని కుటుంబాల వారు వేరే ప్రాంతానికి వెళ్లిపోయారు. మరికొందరు మరమ్మతులు చేసుకొని జీవిస్తున్నారు.
- వరద బాధిత కుటుంబాల్లో రూ.16,500 పరిహారం ఇంకా కొన్ని కుటుంబాలకు అందలేదు. ఈ విషయమై నగరపాలక సంస్థ అధికారులు పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా స్పందన లేదు.
- ధ్వంసమైన రహదారులు, దెబ్బతిన్న విద్యుత్తు వ్యవస్థ, డ్రైనేజీల నిర్మాణం వంటి మౌలిక సదుపాయాల పునరుద్ధరణకు రూ.140 కోట్లతో ప్రతిపాదనలు చేసి పంపారు. ప్రభుత్వం నిధుల విడుదలకు హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు.

గొలుసుకట్టు చెరువు ప్రభావిత కాలనీలు: కవిరాజనగర్, మాణిక్యనగర్, చైతన్యనగర్, వరదయ్యనగర్, ధంసలాపురం కొత్తకాలనీ.

◆ మొత్తం కూలిపోయిన, దెబ్బతిన్న ఇళ్లు: 9292
◆ పరిహారం అందింది: 8,700
◆ అభివృద్ధి పనులకు, ఇతర అవసరాలకు నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి రూ.4 కోట్లు ఖర్చుచేశారు.

● **మున్నేరు ప్రభావిత కాలనీలు:** పద్మావతినగర్, వెంకటేశ్వరనగర్, జూబ్లీపుర, సారథినగర్, బొక్కలగడ్డ, పంపింగ్ వెల్ రోడ్, గణేష్‌నగర్, ప్రకాశ్‌నగర్, మోతీనగర్, రామన్నపేట, దానవాయిగూడెం, మేకల నారాయణనగర్.

మంచికంటినగర్‌లో దెబ్బతిన్న ఓ ఇల్లు ఖాళీ చేసి వెళ్లిన కుటుంబం, పక్కనే కొనసాగుతున్న కాంక్రీట్ గోడ నిర్మాణం

రైతులకు ప్రత్యేక పరిహారం అందని ద్రాక్షే

కూసుమంచి, న్యూస్‌టుడే: 2024 సెప్టెంబరు 1న సంభవించిన జల విలయం.. ఆకాశానికి చిల్లులు పడ్డట్లు.. గంటల వ్యవధిలోనే కురిసిన భారీ వర్షం పాలేరు నియోజకవర్గాన్ని అతలాకుతలం చేసింది.

◆ పాలేరు, ఆకేరు వాగుల ఉద్ధృతికి కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం గ్రామీణం, నేలకొండపల్లి మండలాల్లో 12,298 ఎకరాల్లో పంట నష్టం జరగ్గా, 12,168 ఎకరాలకు సంబంధించి రూ.10 వేల చొప్పున పరిహారం అందింది.

◆ కూసుమంచి మండలంలోని నాసుతండా, పాలేరు, నాయకన్‌గూడెంలో, తిరుమలాయపాలెం మండలంలో రాకసితండా, గ్రామీణం మండలంలో వాల్యాతండా, కస్నాతండా, తీర్థాలలో ఇళ్లు కూలి, నివాసాల్లో నీరు చేరి తీవ్ర నష్టం వాటిల్లింది. నాసుతండావాసులకు ఇళ్లు నిర్మిస్తామన్న హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. పాలేరు బీసీ కాలనీ వాసులదీ అదే సమస్య.

◆ తిరుమలాయపాలెం మండలంలోని రాకాసి తండా, ఖమ్మం గ్రామీణం వాల్యతండా, కస్నాతండా, తీర్థాల ప్రాంతాల్లో పొలాలు ఇసుక, రాళ్ల మేట వేశాయి. ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు, కేంద్ర మంత్రి ప్రత్యేకంగా ఆదుకుంటామని హామీనిచ్చారు. ఆ పరిహారం ఊసేలేదు.

★ సాగునీటి వ్యవస్థకు సంబంధించిన కాలువ మరమ్మతులు, యూటీల నిర్మాణం, లైనింగ్ పటిష్ఠత వంటి పనులు దాదాపు పూర్తయ్యాయి.

జ్ఞాపకాల మదిలో..
జాతస్య హిధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృత్యస్యచ
తస్మాద పరిహార్యేర్థే నత్వం శోచితు మర్హసి

మీరు చూపిన ఆత్మీయత..
అనురాగం మా అభివృద్ధికి వేసిన పూబాట
మీరు భౌతికంగా దూరమైనా మా చెంత ఉన్నట్లే ఉంది.
ఏమిచ్చి రుణం తీర్చుకోము మా యదలోతుల్లోని
భావాలను అక్షర రూపంలో నివేదించడం తప్ప

స్మృతి, వర్ధంతి, జయంతి

ప్రకటనల వివరాలకు
ఖమ్మం: 8008510764, 8008709925, 8008709924
కొత్తగూడెం: 8008709920, సత్తుపల్లి: 8008001776
భద్రాచలం, మణుగూరు: 8247668656, మధిర, ఇల్లెందు: 8008510764

(c) eenadu

పూల పండగలు వచ్చేస్తున్నాయ్..

వైరా, తల్లాడ, న్యూస్‌టుడే

పూల పండగలు ఇప్పటికే వచ్చేశాయి. శ్రావణ మాసంలో మొదలైన వేడుకలు విజయ దశమి బతుకమ్మ ఉత్సవాలతో పూర్తి పూలమయంగా మారుతాయి. ఈ క్రమంలో పూల సీజన్ మొదలవుతుంది. ఈ నేపథ్యంలో బంతిపూలు, చామంతి పూల సాగు వివిధ దశల్లో ఉంది. పూలకు డిమాండ్ ఉన్న తరుణంలో రైతులు తగిన సాగు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని వైరా కేవీకే శాస్త్రవేత్తలు పావని, పణిశ్రీ పేర్కొన్నారు.

సస్యరక్షణ..

బంతి, చామంతికి నీటి తడులు ముఖ్యం. ఆరేడు వారాల నుంచే పూత మొదలవుతుంది. శాఖీయ, పూత దశలో తేమ అవసరం. నీటి ఎద్దడికి గురైతే దిగుబడి తగ్గుతుంది. ఎత్తుగా పెరిగే ఆఫ్రికన్ బంతి రకంలో చివరగా పూమొగ్గ పెరుగుతుంది. దీన్ని తుంచివేస్తే పక్క కొమ్మలు అధికమై ఎక్కువ పూలు పూస్తాయి. మొగ్గ నుంచి విచ్చుకున్న పూలు త్వరగా వస్తాయి. చామంతి మొక్కలు రాత్రి సమయం ఎక్కువగా పెరుగుతాయి. ఇవి పూలు పూసేటప్పుడు బరువుకు వంగి పోకుండా వెదురు కర్రతో ఊతమివ్వడం మేలు. వీటి తలలు తుంచి వేస్తే పక్క కొమ్మలు ఎక్కువై దిగుబడి పెరుగుతుంది. చామంతి సాగు సమయమైతే ఎరువు అధిక దిగుబడి వీయొచ్చు. బంతి సైతం మంచి లాభాలను ఇస్తుంది.

* బంతి, చామంతిలో పేను బంక సమస్య ఉంది. తల్లి, పిల్ల పురుగులు మొక్క అన్ని భాగాల నుంచి రసం పీల్చి జిగట పదార్థాన్ని విడుదల చేస్తాయి. దీంతో ఆకులపై శిలీంధ్రాలు ఏర్పడి ఎదుగుదల ఆగిపోతుంది. కిరణజన్య సంయోగక్రియ ఆగి మొక్క బలహీనమవుతుంది. దిగుబడి రాదు. నివారణకు ఎకరానికి 15 పసుపు రంగు జిగురు అట్టలు అమర్చాలి. వేపనూనె 5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

* తామర పురుగులు అధికంగా ఉండి ఆకు అడుగు భాగం నుంచి రసం పీలుస్తాయి. ఆకుల మీద తెల్లటి మచ్చలు ఏర్పడి పసుపురంగులోకి మారుతాయి. నివారణకు పసుపు రంగు జిగురు అట్టలతో పాటు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిటమిప్రిడ్ 0.2 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

* పచ్చపురుగు సమస్య ఉంది. ఇది గొంగళి పురుగు జాతికి చెందింది. ఇవి ఆకులు, పూలను నష్టపరుస్తాయి. నివారణకు ఇండోక్సాకార్బ్, నోవాల్యూరాన్ అనే మందును మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. బూడిద తెగులు నివారణకు నీటిలో కరిగే గంధకం మూడు గ్రాములు లేదా డైనోకాప్ మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

* ఆకుమచ్చ, పువ్వు కుళ్లు తెగుళ్ల నియంత్రణకు మ్యాంకోజెబ్ మూడు గ్రాములు లేదా క్లోరోథాలోనిల్ రెండు గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

రైతేరాజు

ఉద్యాన పంటలకు ఊతం

సోలార్ డ్రైయర్ల విధానంలో ఎండబెట్టే విధానాన్ని వివరిస్తున్న ఉద్యానశాఖ అధికారి వేణు

కొణిజర్ల, తల్లాడ, న్యూస్‌టుడే

పండ్లు, కూరగాయలకు మంచి దిగుబడి వచ్చినా మార్కెట్‌లో ఒకేసారి అధిక సరకు రావడంతో ధరలు అమాంతం పడిపోతుంటాయి. మరోవైపు త్వరగా పాడయ్యే ఉద్యాన ఉత్పత్తులను ఎక్కువ రోజులు నిల్వ చేయలేక రైతులు వచ్చిన ధరకు విక్రయించుకోవాల్సి వస్తోంది. ఈ సమయంలో సోలార్ డ్రైయర్ల ద్వారా పంట ఉత్పత్తులను ఎండబెట్టి విలువ జోడించడం రైతులకు మెరుగైన ప్రత్యామ్నాయం. సోలార్ డ్రైయర్లు ఓ అద్భుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమని ఉద్యానశాఖ అధికారి ఆకుల వేణు తెలిపారు. పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలతోపాటు ధాన్యాల్లోని అదనపు తేమను తొలగించి పంట నష్టాన్ని తగ్గించేలా చేస్తుందని ఆయన వివరించారు.

రాయితీ ఇలా..

సోలార్ డ్రైయర్ యూనిట్లకు ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. 70కిలోలు, వంద కిలోల సామర్థ్యం ఉన్న యూనిట్లు ఉద్యానశాఖ ద్వారా ఇవ్వనున్నారు. వాటికి ఆయా రైతులను బట్టి రాయితీ వర్తిస్తుంది. వివరాలకు ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించాలని కోరుతున్నారు.

సూర్యశక్తితో..

పండ్లు, కూరగాయలు, ఆకులు, ఇతర పంటలను సూర్యరశ్మి వేడితో తేమను తగ్గించి ఎండబెట్టే పరికరమే సోలార్ డ్రైయర్. ఉత్పత్తులను ట్రేలపై ఉంచి వేడి గాలి ప్రసరణ ద్వారా ఎండబెడతారు. బహిరంగ ప్రదేశాల్లో ఎండబెట్టినప్పుడు దుమ్ము, పక్షులు, కీటకాలు, ఆకస్మిక వర్షాల వల్ల నాణ్యత దెబ్బతింటుంది. సోలార్ డ్రైయర్లలో ఉత్పత్తులను పరిశుభ్రంగా, సురక్షితంగా ఎండబెట్టుకోవచ్చు.

● మిరపను ఈ విధానంలో ఎండబెడితే నాణ్యత పెరిగి విలువ పెరుగుతుంది.

● పసుపు, అల్లం ఎండబెట్టి పొడి తయారీకి ఉపయోగించవచ్చు. ● ఉల్లిపాయ, వెల్లుల్లి, పౌడర్లకు ఈ విధానం ఉపయుక్తం.

● టమాట ఒరుగులు, ఫ్లేక్స్, పౌడర్లు, మునగాకు, కరివేపాకు, కొత్తిమీర, ఎండిన ఆకుల పౌడర్ చేయడానికి, నాణ్యత మెరుగ్గా ఉండటానికి ఉపయోగం.

● మామిడి, అరటి ముక్కలు, ఇతర విలువ ఆధారిత ఉత్పత్తులకు ఈ విధానం ఎంతో ఉపయోగం.

● పంటకోత అనంతరం నష్టాలను తగ్గించుకోవచ్చు, ఉత్పత్తులను పరిశుభ్రంగా ఎండబెట్టడానికి, నిల్వకాలాన్ని పెంచకోవచ్చు.

● ఆహార ఉత్పత్తులు సహజ రంగు, రుచి, పోషకాలతో పాటు సువాసన పాడవకుండా ఉంటాయి.

పదిహేనేళ్లుగా పత్తి సాగు

మధిర, న్యూస్‌టుడే

పదిహేనేళ్లుగా పత్తి సాగు చేసి మంచి ఆదాయాన్ని గడిస్తున్నాడు ఓ యువరైతు. తనకున్న రెండెకరాలతో పాటు మరో 30 ఎకరాలు కౌలుకు తీసుకుని కేవలం పత్తి సాగు చేసి ఏటా మంచి లాభాలు సాధిస్తున్నాడు. కుటుంబ సభ్యులు ఎక్కువ సమయం పత్తి చేలో పనిచేయడంతో పెట్టుబడులు తగ్గి కొంత ఆదాయం వస్తుందని అంటున్నారు ఆ యువ రైతు. అతనే మధిర మున్సిపాలిటీలోని దిడుగుపాడు గ్రామానికి చెందిన వెంకట రవి. వివరాలు ఆయన మాటల్లోనే.. 'నాకు సొంత ట్రాక్టర్, జత ఎద్దులు ఉన్నాయి. 30 ఎకరాల వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని ఏటా పత్తి సాగు చేస్తున్నా. ఈ ఏడాది పరిస్థితులు సరిగా అనుకూలించకున్నా కొండంత ఆశతో పత్తినే సాగుకు ఎంచుకున్నా. రెండు నెలల క్రితం సాగు పనులు ప్రారంభించడంతో ప్రస్తుతం పైరు గుబురు దశలో ఉంది. ఆ నెలలో పంట చేతికందుతుంది. జీవాల కురుస్తున్న వర్షపు జల్లులకు రసాయన ఎరువులు అందిస్తున్నా. దీంతో పైరు ఏపుగా పెరుగుతుంది. దుకాణాల్లో అప్పు లేకుండా నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను నగదుతో కొనుగోలు చేస్తా. ఇతర పొలాల్లో ట్రాక్టర్‌తో కిరాయి పనులు చేసినప్పుడు వచ్చే డబ్బును ఇందుకోసం వినియోగిస్తా. ఫలితంగా పెట్టుబడులు తగ్గుతాయి. ఏటా ఎకరాకు 8 క్వింటాళ్లకు తగ్గకుండా దిగుబడి వస్తుంది. దళారీలకు విక్రయించకుండా సీసీఐలోనే అమ్ముకోవటం ద్వారా ధర లభిస్తోంది. కౌలు భూమిలో సాగుతోపాటు సొంత పొలంలో ఉన్న పని ఎద్దులతో ప్రతి ఏటా పత్తి అనంతరం మొక్కజొన్న సాగుచేసి మరికొంత ఆదాయాన్ని పొందుతున్నా'.

పత్తి పైరు.. రైతు వెంకట రవి(అంతర చిత్రం)

'నేత్రదానం మహత్తర సేవ'

సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: నేత్రదానం ఓ మహత్తర సేవగా ప్రతి ఒక్కరూ భావించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ పిలుపునిచ్చారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఖమ్మం ఐడీవోసీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కళ్లద్దాలున్నవారు, మధుమేహం, బీపీ వంటి వ్యాధులతో బాధపడేవారు కూడా నేత్రదానం చేయొచ్చని సూచించారు. కామెర్లు, ఎయిడ్స్, బ్లడ్ క్యాన్సర్‌తో మరణించిన వారు అనర్హులని స్పష్టంచేశారు. ఏ వయసు వ్యక్తి మరణించినా 6-8 గంటల్లో నేత్రాలను సేకరించవచ్చన్నారు. నేత్రదానం చేయాలని భావిస్తే మరణం తర్వాత వ్యక్తి తల రెండు దిండ్లపై ఎత్తుగా ఉంచాలన్నారు. కళ్లను వెంటనే మూసి వాటిపై ఐస్ ముక్క, గుడ్డను ఉంచి ఫ్యాన్‌ను ఆఫ్ చేయాలన్నారు. నేత్రనిధిని ఎంత త్వరగా కుటుంబ సభ్యులు, స్నేహితులు, ప్రజలకు అవగాన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ నేత్రదాన ఉద్యమాన్ని మరింత విస్తృతం చేయాలన్నారు. దాతల సమాచారాన్ని ఖమ్మం ఐ బ్యాంకుకు చెందిన 93971 91919, 92475 71995 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఎంహెచ్‌వో రామారావు, డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్, డీబీసీఎస్ వెంకటనర్సయ్య, ఖమ్మం నేత్రనిధి కౌన్సిలర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీసీ ఇన్‌ఛార్జి డీడీగా సరిత

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: ఖమ్మం రైతుశిక్షణ కేంద్రం(ఎఫ్‌టీసీ) ఇన్‌ఛార్జి ఉప సంచాలకురాలిగా సరిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ డీడీగా పనిచేసిన కనకరాజు ఉద్యోగ విరమణ చేయటంతో ఆయన స్థానంలో 'ఆత్మ' ప్రాజెక్టు డైరెక్టరుగా పనిచేస్తున్న సరితకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

జెన్‌జీ పోరాటం స్ఫూర్తిదాయం: ఎస్‌ఎఫ్‌ఐ

ఏదులాపురం, న్యూస్‌టుడే: పేపర్ లీకేజీలను వ్యతిరేకిస్తూ జంతర్‌మంతర్ వద్ద విద్యార్థులు, యువత చేపట్టిన పోరాటం స్ఫూర్తిదాయకమని ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ సహాయ కార్యదర్శి ఐపీ ఘోష్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. సోమవారం మున్సిపాలిటీలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ అధ్యక్షతన జెన్‌జీ మీట్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జెన్‌జీ ఉద్యమం ప్రజాస్వామ్య పరిరక్షణకు ఒక కొత్త దిశను చూపిందన్నారు. విద్యార్థులు తమ విద్య, ఉద్యోగ హక్కుల కోసమే కాకుండా ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలు, నిరుద్యోగం వంటి సమస్యలపై ప్రభుత్వాలు బాధ్యత వహించాల్సిందేనన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రజనీకాంత్, గర్ల్స్ కన్వీనర్ మమత, రాజు, వెంకటేశ్, సాత్విక, పూజిత, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో సమస్యలు పరిష్కరించాలి

ధర్నాచౌక్‌లో ఆందోళన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. విద్యా, వైద్య రంగాల్లో ఇబ్బందులు తొలగించాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా విద్య, వైద్య సమస్యలపై మండల కేంద్రాల్లో సీపీఎం ఆధ్వర్యంలో సర్వే నిర్వహించామని వెల్లడించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బంది, మందులు సరిపడా లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా సర్వజనాసుపత్రిని 1000పడకల సామర్థ్యంగా విస్తరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పార్టీ సీనియర్ నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాచర్ల భారతి, కల్యాణం వెంకటేశ్వరరావు, మాదినేని రమేశ్, బండి రమేశ్, యర్రా శ్రీనివాసరావు, బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, బండి పద్మ, మెరుగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సత్కరించిన సీపీ

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సీపీ సునీల్‌దత్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఎస్‌ఐలు వి.సుధాకర్‌రెడ్డి, కె.రాయప్ప, వి.రామారావు, ఏఎస్‌ఐలు ఎం.శ్రీనివాసరావు, ఎండీ అబ్దుల్ రహెమాన్, హెడ్ కానిస్టేబుళ్లు షేక్ అహ్మద్, కె.సత్యం, ఏఆర్‌ఎస్‌ఐ బి.సుందర్‌రావు, హోంగార్డు ఆర్.వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ చేశారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీపీ వారి సేవలను కొనియాడారు. అదనపు డీసీపీ రామానుజం, ఆర్‌ఐలు కామరాజు, సురేశ్, పోలీస్ సంఘం అధ్యక్షుడు హేమనాథ్, హోంగార్డు సంక్షేమ సంఘం అధ్యక్షుడు బంక శ్రీను, జాతీయ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహబూబాబాద్ కలెక్టర్ కాన్వాయి అడ్డగింత

నెహ్రూ సెంటర్, న్యూస్‌టుడే: ఖమ్మం కలెక్టరేట్‌లో శిక్షణ డిప్యూటీ తహసీల్దార్ డోలి సంధ్య ఆత్మహత్య కేసులో బాధ్యుడ్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆమె తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, పద్మ సోదరుడు రాజేష్, విద్యార్థి సంఘాల నాయకులు, బంధువులు సోమవారం మానుకోట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారిపై కలెక్టర్ స్నేహ శబరీష్ కాన్వాయిని అడ్డుకొని నిరసన తెలిపారు. సంధ్య సోదరుడు డోలి రాజేష్ ఒంటిపై పెట్రోలు పోసుకునేందుకు ప్రయత్నించగా పోలీసులు అతడ్ని అదుపులోకి తీసుకొని కలెక్టర్ కాన్వాయిని పంపించారు. కేసముద్రం వైపు నుంచి వస్తున్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, బస్వరాజు సారయ్య వాహనాలను అడ్డుకొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వాహనశ్రేణిని అడ్డుకుంటామని నినాదాలు చేయడంతో డీఎస్పీ మోహన్, సీఐ అంజలి ఎస్సైలు, సిబ్బందితో కలిసి వారికి సర్దిచెప్పి నేతల వాహనాలను పంపించారు.

దాడి కేసులో మూడు నెలల జైలు

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: గ్రామ సర్పంచ్‌పై దాడి చేసి, పంచాయతీ కార్యదర్శిని దూషించిన కేసులో ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామానికి చెందిన నిందితుడు బానోత్ కిరణ్‌కు 3 నెలల జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు జడ్జి యేపూరి బిందుప్రియ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ ప్రకారం.. 2021, ఏప్రిల్ 23న తీర్థాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి చల్లా భవ్య విధులు నిర్వహిస్తుండగా నిందితుడు కిరణ్ వచ్చి కరువు పని కావాలని అడగ్గా 'వారం రోజుల్లో పని మొదలు పెడతాం. దరఖాస్తు చేసుకోవాల'ని సమాధానమిచ్చారు. నిందితుడు ఎవడికి దరఖాస్తు చేసుకోవాలని దూషిస్తుండగా అక్కడే ఉన్న సర్పంచ్ తేజావత్ బాలకృష్ణ వారించబోగా ఆయన కాలర్ పట్టుకొని చెంపపై కొట్టాడు. కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు.

మాజీ ఎమ్మెల్సీ సామినేని సతీమణి మృతి

ముదిగొండ, న్యూస్‌టుడే: మండలంలోని మేడేపల్లికి చెందిన దివంగత మాజీ ఎమ్మెల్సీ సామినేని హిమవంతరావు సతీమణి సామినేని సరస్వతి(86) అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. ఆమె మృతదేహాన్ని వివిధ పార్టీలకు చెందిన నాయకులు సందర్శించి నివాళులర్పించారు. మేడేపల్లిలో మంగళవారం ఉదయం 11గంటలకు తన మాతృమూర్తి అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆమె కుమారుడు, మాజీ సర్పంచి సామినేని రమేశ్ తెలిపారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: మోసపూరితంగా ఇల్లు విక్రయించిన కేసులో నల్గొండ జిల్లా అనుముల మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన మేడిద మాల్యాద్రి(ఏ1), ఖమ్మం వైరారోడ్‌లోని అలహాబాద్ బ్యాంక్ మేనేజర్ కేవీఎన్ రామకృష్ణ(ఏ3)కు మూడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమశ్రేణి కోర్టు జడ్జి యేపూరి బిందుప్రియ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ ప్రకారం.. ఏపీ రాష్ట్రం చిత్తూరులో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న కాళంగి మాధవీరత్నం అక్కడే జిల్లా సమాచార అధికారిగా పనిచేస్తున్న ఆమె భర్త కిరణ్ సుధాకర్ కలిసి 2012, మార్చి 21న ఖమ్మం శ్రీరాంనగర్‌లో రూ.22 లక్షలకు మాల్యాద్రి వద్ద ఇల్లు కొనుగోలు చేశారు. రూ.20 లక్షలు అలహాబాద్ బ్యాంక్ నుంచి రుణం తీసుకున్నారు. ఒరిజినల్ దస్తావేజులు బ్యాంక్‌లో డిపాజిట్ చేశారు. అనంతరం ఆ ఇంటిని స్వాధీనం చేసుకొని అద్దెకు ఇవ్వగా 2015, మార్చి 2న ఏపీజీవీబీ ఖమ్మం శాఖ మేనేజర్ పట్నాయక్ వచ్చి సదరు ఇల్లు తమ బ్యాంక్ తనఖాలో ఉందని, వెంటనే ఖాళీ చేయాలని కిరాయిదారునికి చెప్పారు. ఆయన విషయాన్ని యజమానులకు తెలియచేయగా వారు ఖమ్మం వచ్చి ఆయా బ్యాంకుల్లో విచారించారు. రెండు బ్యాంకుల్లో సరైన సమాధానం చెప్పలేదు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు ఇద్దరు బ్యాంక్ మేనేజర్లతోపాటు ఇల్లు అమ్మిన మాల్యాద్రిపై ఖానాపురం హవేలి ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో ఏ1 మాల్యాద్రి, ఏ3 కేవీఎన్ రామకృష్ణపై నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఎస్.గాయత్రి వాదనలు వినిపించగా ఐఓలు టి.వెంకటేశ్వర్లు, సీహెచ్.శ్రీధర్, కె.రామారావు, సీడీఓ ఎ.మదారు సహకరించారు.

ప్రజా ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్లు

ఖమ్మం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వారు ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిశీలించి సంబంధిత శాఖల అధికారులకు అందించారు. డీఆర్వో రామమూర్తి తదితరులు పాల్గొన్నారు. మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాల దృష్ట్యా కలెక్టరేట్‌లో ప్రజల హాజరు తగ్గింది.

★ కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామ పంచాయతీలో ప్రత్యేక అధికారి పాలన సమయంలో రూ.9లక్షల బిల్లుల చెల్లింపుపై సమగ్ర విచారణ నిర్వహించాలని లకావత్ సంతోష్ ఫిర్యాదు చేశారు.

★ కల్లూరు మండలం తాళ్లూరి వెంకటాపురం గ్రామవాసి పాశం నాగేశ్వరరావు తన కుమార్తె ప్రియమణిని లంకపల్లి బీసీ గురుకుల పాఠశాల నుంచి రెబ్బవరం గురుకుల పాఠశాలకు మార్చాలని కోరారు.

★ తిరుమలాయపాలెం మండలం తాళ్లచెరువు గ్రామవాసి జోగుపర్తి బుచ్చమ్మ తన భర్త మరణించిన తర్వాత తనకు తెలియకుండా భర్త పేరుమీదున్న 6.30 ఎకరాల భూమిని కుమారుడు, కోడలు వారి పేరుతో పాసుపుస్తకం చేయించుకున్నారని, ఇప్పుడు తన సంరక్షణకు సాయం చేయటం లేదని విన్నవించారు.

నర్సు మృతదేహానికి అంతిమ సంస్కారాలు

ములకలపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో అత్యాచారం, హత్యకు గురైన నర్సు మృతదేహానికి సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె పార్థివదేహం వద్ద అశ్వారావుపేట, భద్రాచలం ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, తెదేపా నియోజకవర్గ బాధ్యులు కట్రం స్వామి, జడ్పీటీసీ మాజీ సభ్యులు అంజి, పైడి వెంకటేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే జారె ఆదివారం రాత్రి నుంచి యువతి అంత్యక్రియలు పూర్తయ్యే వరకు పనులను పర్యవేక్షించి, యువతి పాడెను మోశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, దోషులకు శిక్షపడే వరకు కృషి చేస్తామన్నారు. యువతి కుటుంబంలో ఒకరి ఉద్యోగం, ప్రభుత్వం తరఫున నగదు, ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

యువతి పాడె మోస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

యువతి పేరు మీద చట్టం తీసుకురావాలి

దిశ, నిర్భయ తరహాలో బాధిత యువతి పేరు మీద చట్టం తీసుకువచ్చి గిరిజనులకు న్యాయం చేయాలని, నర్సింగ్ పూర్తి చేసిన గిరిజన విద్యార్థులకు అనువుగా ఉండేలా గిరిజన ప్రాంతాల్లో వైద్యకళాశాలలు, ఆసుపత్రులు ఏర్పాటు చేయాలని ఆదివాసీ, తుండు దెబ్బ రాష్ట్ర నాయకులు, గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

ర్యాక్ పాయింట్‌కు ఎరువుల రాక

చింతకాని: పందిళ్లపల్లి రైల్వే ర్యాక్ పాయింట్‌కు సోమవారం కాంప్లెక్స్ ఎరువులు వచ్చాయని డీఏఓ ధనసరి పుల్లయ్య తెలిపారు. 574 టన్నుల అమ్మోనియం సల్ఫేట్, 765 టన్నుల డీఏపీ వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ ఎరువును ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని సహకార సంఘాలకు, పలు ఎరువుల దుకాణాలకు లారీలు, ట్రాక్టర్ల ద్వారా పంపిణీ చేశారు.

12న జాతీయ లోక్ అదాలత్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి ఎం.నాగరాజు, చిత్రంలో డీఎల్ఎస్ఏ జడ్జి దేవీమానస, బార్ అధ్యక్షుడు రమేశ్ తదితరులు

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఈ నెల 12న జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా జడ్జి, న్యాయసేవా సంస్థ ఛైర్మన్ ఎం.నాగరాజు పిలుపునిచ్చారు. బ్యాంకులు, ఫైనాన్స్, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో జిల్లా కోర్టు హాల్‌లో సోమవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు సూచనలు చేశారు. జిల్లా జడ్జి మాట్లాడుతూ.. రాజీకి అవకాశం ఉన్న పెండింగ్, ప్రీ-లిటిగేషన్ కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలతో సంప్రదింపులు జరిపి, వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించడమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కక్షిదారులు కూడా ఎలాంటి భేషజాలకు పోకుండా తమ కేసులను రాజీ చేసుకుని ప్రశాంతంగా జీవించాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకుంటే అప్పీలుకు అవకాశం లేని సత్వర న్యాయం లభిస్తుందన్నారు. బ్యాంకులు, ఫైనాన్స్, బీమా కంపెనీలు సహకరించాలని కోరారు. న్యాయసేవాసంస్థ కార్యదర్శి పి.దేవీమానస, బార్ అధ్యక్షుడు యడ్లపల్లి రమేశ్, వివిధ బ్యాంకులు, ఫైనాన్స్, బీమా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతదేహం లభ్యం

పెంటి కృష్ణయ్య(పాత చిత్రం)

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: కనిపించకుండా పోయిన వ్యక్తి రెండు రోజుల తర్వాత వ్యవసాయ బావిలో శవమై కనిపించిన ఘటన బాలపేటలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుడైన పెంటి కృష్ణయ్య(50) శనివారం(29న) తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అనారోగ్యంతో బాధపడుతున్న కృష్ణయ్య మందులు వాడుతున్నాడంటూ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం ఖానాపురంహవేలి స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానికంగా ఓ వ్యవసాయ బావిలో దుస్తులు లేకుండా ఉన్న కృష్ణయ్య మృతదేహాన్ని గుర్తించారు. అన్నం సేవా ఫౌండేషన్ నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బృంద సభ్యులు కృష్ణయ్య మృతదేహాన్ని సర్వజనాసుపత్రికి తరలించారు.

ఎమ్మెల్యే పీఏ ఖాతాలపై పోలీసుల ఆరా

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు వద్ద పీఏగా పనిచేసిన కల్యాణ్ కుమార్ బ్యాంకు ఖాతాలపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. నగదు లావాదేవీలు ఏ విధంగా సాగించాడన్నది ఆయా బ్యాంకుల స్టేట్‌మెంట్‌లను సేకరిస్తున్నట్లు సమాచారం. తనతో పాటు తన కుటుంబానికి చెందిన వారి ఖాతాల్లో భారీగా జమ అవడంతో ఆ ఖాతాల వివరాల కూపీ లాగుతున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నకిలీ అపాయింట్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేశాడు. ఏడాది కాలంగా ఈ దందా సాగుతుండగా ఈ మధ్యనే వివాదం రచ్చకెక్కింది. ఈయన ఆగడాలను ఆలస్యంగా గుర్తించిన బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికే భద్రాచలం స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈయన నివాసం ఉంటున్న మణుగూరులోను రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు నిరుద్యోగుల నుంచి వసూలు చేయడంతో బాధితులు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిసింది. రూ.కోట్ల వసూళ్ల గుట్టు రట్టు చేసేందుకు పోలీసులు క్షేత్ర స్థాయిలో సందర్శించి అసలు ఏం జరిగిందన్నది రాబడుతున్నారు. పీఏకు ఇంకెవరైనా సహకరించారా? అనే కోణంలో దృష్టి సారించారు. రెవెన్యూ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా చేస్తున్న కల్యాణ్‌కుమార్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకునే వీలుంది.

చెల్లని చెక్కు కేసులో ఆర్నెల్ల జైలు

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం రావిగూడెం దాస్యతండాకు చెందిన నిందితుడు బానోత్ రాజేశ్‌కు 6 నెలల జైలుశిక్షతోపాటు ఫిర్యాదుదారుకు రూ.3 లక్షలు చెల్లించాలని ఆదేశిస్తూ ఖమ్మం మొదటి అదనపు ప్రథమశ్రేణి కోర్టు జడ్జి బెక్కం రజనీ సోమవారం తీర్పు చెప్పారు. నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం గ్రామానికి చెందిన ఫిర్యాదుదారు సిరికొండ వెంకటేశ్వర్లు తరపు న్యాయవాదులు ఇరుకులపాటి వెంకటేశ్వర్లు, వి.ప్రమీల దాఖలు చేసిన ప్రైవేటు కేసులో ఈ తీర్పు వెలువరించారు.

శివకుమార్ హత్య కేసులో నిందితుల అరెస్టు

★ పరారీలో మరో నలుగురు

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరులో ఈ నెల 27న సింహాద్రి శివకుమార్(28)పై దాడికి పాల్పడి హత్య చేసిన నిందితులను సోమవారం పోలీసులు పట్టుకున్నారు. ఎంకే గ్యాంగ్‌కి చెందిన పలువురు యువకులు అతడిపై కక్ష పెంచుకోవడమే కారణమని తేల్చిచెప్పారు. మణుగూరు ఠాణాలో డీఎస్పీ రవీంద్రారెడ్డి వివరాలను వెల్లడించారు. పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌కి చెందిన శివకుమార్ హైదరాబాద్‌లో ఇంటీరియర్ కాంట్రాక్టు పనులు చేస్తూ జీవిస్తున్నాడు. గాంధీబొమ్మ సెంటర్‌కి చెందిన హర్ష, సుందరయ్యనగర్‌కి చెందిన సతీష్ అనే యువకులు అతడి దగ్గర పనిచేస్తున్నారు. అదే సెంటర్‌కి చెందిన లోకేశ్ అనే యువకుడు చదువు నిమిత్తం హైదరాబాద్‌లో ఉంటున్నాడు. నెల రోజుల క్రితం లోకేశ్ సతీష్‌కి ఫోన్ చేసి పాత గొడవలు మనసులో పెట్టుకుని తిట్టాడు. వారిద్దరి మధ్య జరిగిన గొడవలో లోకేశ్ సతీష్‌ని కొట్టగా మధ్యలో శివకుమార్ జోక్యం చేసుకుని గొడవను ఆపాడు. లోకేశ్ ఎంకే గ్యాంగ్‌కి చెందిన లీడర్ జెట్‌పట్ రమాకాంత్‌కి చెప్పాడు. రమాకాంత్ సతీష్‌కి ఫోన్ చేసి శివకుమార్ మణుగూరు వస్తే అంతుచూస్తామని పలుమార్లు ఫోన్ చేసి బెదిరించాడు. ఆగస్టు 26న శివకుమార్, సతీష్, బన్నీ పనిలో ఉండగా, రమాకాంత్ సతీష్‌కి ఫోన్ చేసి రాఖీ పండగకు మణుగూరుకు వస్తే చంపేస్తామని బెదిరించాడు. పక్కనే ఉన్న శివకుమార్ ఫోన్ తీసుకుని మేము పనిలో ఉన్నామని, ఎందుకు ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నావని ప్రశ్నించాడు. రమాకాంత్ శివకుమార్‌ని ఫోన్‌లో బూతులు తిడుతూ మాట్లాడాడు. మళ్లీ అదే రోజు సాయంత్రం ఫోన్ చేసి నీవు మణుగూరుకు వస్తే ఇద్దరిలో ఎవరో ఒకడే బతకాలని బెదిరించాడు. శివకుమార్ 27న మణుగూరుకు వెళ్లి ఉదయం 11 గంటలకు అతడి ఇంటి పక్కన ఉన్న ఉదయ్‌కుమార్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై నేతాజీ సుభాష్ చంద్రబోస్ క్రీడా మైదానానికి వెళ్లాడు. అప్పటికే ముందస్తు ప్రణాళికతో వేచి ఉన్న రమాకాంత్, సాధిక్, వినయ్, దినేశ్, జంపయ్య, ప్రసాద్‌లు చేతి కడియం, కర్రతో మూకుమ్మడిగా దాడి చేసి హత్య చేశారు. శివకుమార్ తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. హత్య కేసులో 27 మంది ఉన్నట్లు గుర్తించామని, వారిలో 23 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కి పంపినట్లు తెలిపారు. వారి నుంచి 9 ద్విచక్ర వాహనాలు, 20 సెల్ ఫోన్లు, కర్ర, చేతి కడియం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఏసు, సాంబరావు, నాగేంద్రబాబు, మల్లికార్జున్ పరారీలో ఉన్నట్లు వివరించారు. దర్యాప్తులో కృషి చేసిన సీఐ నాగబాబు, ఎస్సైలు నగేశ్, రవూఫ్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రవీంద్రారెడ్డి, చిత్రంలో సీఐ నాగబాబు, ఎస్సైలు

EENADU Classifieds

JOBS

Wanted Delivery boys and Office Staff Locations: Miryalaguda | Suryapet | Khammam Salary: ₹25k – ₹30k Contact / WhatsApp: 9398161694.

Applications are invited from the Candidates having B.A., B.Ed qualifications of work in a recognised Private English Medium School in Kothagudem. Special English and Male Candidates are preferable. Cont: 9963659568.

ఖమ్మం అత్యంత ప్రతిష్టాత్మకమైన వ్యాపార దిగ్గజం G.V. మాల్‌లో పనిచేయుటకు డ్రైవర్స్ కావలెను. ఏజ్ 35-45, అర్హత: 10th పాస్, మంచి జీతం. అన్ని ఆటోమేటిక్ కార్లు డ్రైవ్ చేసే వారికి ప్రాధాన్యత. సెల్: 8639773677.

కొత్తగూడెం G.V. మాల్ నందు పనిచేయుటకు క్యాషియర్ వెంటనే కావలెను. సంప్రదించండి: 9281115830.

ఖమ్మంలోని గ్యాస్ ఏజెన్సీలో ఆఫీస్ స్టాఫ్ (F), అకౌంటెంట్స్, క్యాషియర్స్, కం॥ ఆపరేటర్స్, క్లర్క్ (M/F), E-KYC చేయుటకు (M/F) కావలెను. ఖమ్మం: 9490791669.

శ్రీరామ్ అకాడమీకి ఇంటి వద్ద నుండి ప్రాజెక్టు వర్క్ చేయుటకు ఫోన్ ఉన్న వారు కావలెను. అ:10th, జీ:20k. శిక్షణ రుసుము కలదు. Cell: 8886977792.

క్రిస్టియన్ రంగంలో పేరుగాంచిన స్కూల్స్/ కాలేజీలు/ హాస్పిటల్‌లో ఉద్యోగావకాశములు. జీతం: 18-40K ఆసక్తిగల అభ్యర్థులు సంప్రదించండి. క్రిస్టియన్ ఎడ్యుకేషనల్ గ్రూప్. వైజాగ్. 9491314477.

నిత్య అవసర సరుకులు ఇవ్వడానికి Delivery Boys, Stock Manage చేయడానికి Office Staff (M) కావలెను. Cell: 9701112339.

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతి వేగం ఈనాడు క్లాసిఫైడ్స్

(c) eenadu

శ్రీకృష్ణ మందిరంలో వరలక్ష్మీ వ్రతాలు

మధిర పట్టణం, న్యూస్‌టుడే: మధిరలోని శ్రీకృష్ణ మందిరంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని సోమవారం అమ్మవారిని వరలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు రాయప్రోలు విజయ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి వరలక్ష్మీవ్రత పూజలు చేశారు. మధిర సమీప ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి వ్రత పూజల్లో పాల్గొన్నారు.

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర •వైరా

రక్తపరీక్ష కేంద్రాల తనిఖీలు

కల్లూరు: పట్టణంలోని రక్తపరీక్ష కేంద్రాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో బి.ప్రదీప్‌బాబు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తపరీక్ష కేంద్రాల్లో ధరల పట్టికను ఉంచాలని వారిని ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితుల్లో జర పీడితుల సంఖ్య పెరుగుతోందని, ప్రజలు సకాలంలో వైద్య సేవలు పొందాలని సూచించారు. ప్రైవేటు పరీక్షా కేంద్రాల్లో నమోదైన జరపీడితుల సంఖ్యను వెంటనే పీహెచ్‌సీ వైద్యులకు తెలపాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
సత్తుపల్లి : 79933 00536
మధిర : 98668 05652
వైరా : 76619 46938

సమస్య: నాగులవంచ శివాలయం సమీపంలో రహదారికి ఇరువైపులా మురుగు కాలువల వెంట గడ్డి పెరగటంతో దోమల తీవ్రత అధికంగా ఉంది. - **గ్రామస్థుడు**

సమాధానం: కాలువల వెంట చెత్తాచెదారం తొలగించి సమస్య పరిష్కరిస్తాం.
- చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి
– చింతకాని, న్యూస్‌టుడే

మధిర పట్టణం సాయిబాబా గుడి రహదారిలో బురదతో ద్విచక్ర వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- ఓ పాఠకుడు ✔ వెంటనే పరిశీలించి ఆ రహదారిలో బురద లేకుండా చర్యలు తీసుకుంటాం. **- వెంకట్, పారిశుద్ధ్య మేస్త్రి**
– మధిర గ్రామీణం, న్యూస్‌టుడే

క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి

బోనకల్లు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో పుల్లయ్య

పెనుబల్లి, న్యూస్‌టుడే: సమగ్ర శిక్షా అభియాన్ ఆదేశాల మేరకు పెనుబల్లి మండలం భవిత కేంద్రంలో సోమవారం మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహించారు. మండలంలోని పలు పాఠశాలల నుంచి ప్రత్యేక అవసరాల బాలలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పరుగు, క్యారమ్స్, మ్యూజికల్స్ చైర్స్, పాటలు, లెమన్ అండ్ స్పూన్, త్రోబాల్ తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో కావేటి మోహన్‌రావు బహుమతులు అందజేశారు. ఆటల ద్వారా పిల్లల్లో మానసిక, శారీరక సామర్థ్యాలతో పాటు సమాజంలో కలిసిమెలిసి ఉండే నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయన్నారు. పలువురి విజయ గాథలను తల్లిదండ్రులకు వివరించారు. ప్రత్యేక ఉపాధ్యాయులు మురళీకృష్ణ, మంజుల, నాజియా, కుమారి, ఫిజియో థెరపిస్ట్ ప్రభాకర్ పాల్గొన్నారు.

బోనకల్లు: క్రీడలు బాలల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని ఎంఈవో దామాల పుల్లయ్య అన్నారు. భవిత కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల బాలలకు ముష్టికుంట్లలో ఏర్పాటు చేసిన మండల స్థాయి క్రీడలను ఆయన ప్రారంభించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రతి వారం వైద్యులు మండల కేంద్రంలో ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారని వివరించారు. వైకల్యం విద్యకు ఆటంకం కారాదని ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు. సర్పంచి నాగేశ్వరరావు. హెచ్ఎం భాగ్యలక్ష్మి, సునీత, పుల్లారాణి, ఫిజియో థెరపిస్టు అమృతవర్షిణి పాల్గొన్నారు.

మధిరకు జ్వరమొచ్చింది..!

మధిర పట్టణం, న్యూస్‌టుడే

మధిర మండలంలో ఇటీవలి వాతావరణ మార్పుల కారణంగా ప్రతి ఇంటా జ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. కొందరు సాధారణ జ్వర పీడితులు కాగా.. మరికొందరు జ్వరాల కారణంగా ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గిపోయి దూర ప్రాంతాలైన ఖమ్మం, విజయవాడల్లోని వైద్యశాలల్లో చికిత్సకు వెళుతున్న పరిస్థితి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ప్రతిరోజూ ఓపీల్లో జ్వర పీడితుల సంఖ్య అత్యధికంగా ఉంటోంది. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ప్రజలు జ్వరాల కారణంగా పనులకు వెళ్లలేకపోతుండటంతో ఆర్థిక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మరోవైపు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తే పరీక్షల పేరుతో జేబులు గుల్ల చేస్తున్న పరిస్థితి.

పట్టణం, పల్లె అనే తేడా లేకుండా..

మధిర పట్టణంతోపాటు పాటు పల్లెల్లోనూ జ్వర పీడితులు అధికంగా ఉంటున్నారు. మధిర వంద పడకల ఆసుపత్రితో పాటు దెందుకూరు, మాటూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు జ్వర పీడితులు ప్రతిరోజూ అధిక సంఖ్యలో వస్తున్నారు. కొందరికి రెండు మూడు రోజుల్లోనే జ్వరం తగ్గుతుండగా.. మరి కొందరికి ప్లేట్‌లెట్ల సంఖ్య పడిపోవడంతో జిల్లా కేంద్రమైన ఖమ్మంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. నాలుగు రోజుల కిందట ఎర్రుపాలెం మండలం నుంచి వంద పడకల ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చిన వ్యక్తి సాధారణ జ్వరం అని చికిత్స పొందుతుండగా.. వైద్యులు పరీక్షించి తక్షణమే జిల్లా కేంద్రానికి వెళ్లాలని సూచించారు. అక్కడి వైద్యులు పరీక్షల అనంతరం రక్తకణాల సంఖ్య గణనీయంగా పడిపోయాయని గుర్తించి హైదరాబాద్ పంపారు.

మధిర వంద పడకల ఆసుపత్రిలో జ్వరపీడితులు

రోజూ ఓపీలో కొన్ని జ్వర కేసులకు సంబంధించిన రోగులు వస్తున్న మాట వాస్తవమే. కానీ ఇవి సాధారణ వైరల్ ఫీవర్‌కు చెందినవే. రోగులు అంతగా భయపడాల్సిన పరిస్థితి ఏమీ లేదు. కేవలం కొద్ది మందిలోనే జ్వరాల కారణంగా రక్త కణాల సంఖ్య తగ్గుతోంది. డెంగీ, గన్యా, మలేరియా వంటి ప్రమాదకర పరిస్థితులు ఏమీ లేవు. ప్రజలు తమ నివాసిత ప్రాంతాల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలి.
– రవికుమార్, వంద పడకల ఆసుపత్రి సూపరిండెంట్

పారిశుద్ధ్య లోపమే కారణమా..?

మధిర పురపాలకంతో పాటు పలు గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య చర్యలు అధ్వానంగా ఉన్నాయి. వానాకాలం ప్రారంభమైన తర్వాత జ్వరాలు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విస్మరించడంతోనే ఈ పరిస్థితి నెలకొంది. కనీసం వీధుల వెంట మురుగు కాల్వల్లో బ్లీచింగ్ చల్లడాన్నీ మరిచిపోయారు. దోమలు వృద్ధి చెందకుండా ఫాగింగ్ వంటి పనులు సైతం చేయడం లేదు. ప్రత్యేకంగా ప్రభుత్వ ఆదేశాలు వచ్చినప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలను మొక్కుబడిగా చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. మురుగు కాల్వల్లో గంబూషియా చేపలు వదలడంలోనూ నిర్లక్ష్యమే. ఇప్పటికైనా పాలకవర్గాలు, అధికారులు పారిశుద్ధ్య చర్యలపై సరైన దృష్టి సారించి జ్వరాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

సత్తుపల్లి పోస్టాఫీసులో ఆధార్ సేవలు

సత్తుపల్లి: సత్తుపల్లి పోస్టాఫీసులో ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గుగులోత్ రాజేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తుపల్లి మండలం, పట్టణ ప్రజలతోపాటు నియోజకవర్గంలోని ప్రజలంతా ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆధార్‌లో అవసరమైన వివరాల సవరణలు, అప్‌డేషన్ సంబంధించిన సేవలు ప్రభుత్వం నిర్దేశించిన రుసుములతో అందిస్తామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

గోదావరి జలాలతో రైతుకు భరోసా

వైరా: గోదావరి జలాలను వైరాకు తీసుకొచ్చిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ రైతులకు పూర్తి భరోసా కల్పించారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఏఎంసీ ఛైర్మన్ బోళ్ల గంగారావు, డా. కాపా మురళీకృష్ణ, దొడ్డా పుల్లయ్య, చంద్రశేఖర్ రెడ్డి, సీతారాములు, దానియేలు స్థానిక క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ఆయకట్టులో వేలాది ఎకరాల్లో వరిపంటకు ప్రతికూలతలోనూ సాగునీరు అందించిన ఘనత ఎమ్మెల్యేకు దక్కుతుందన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

వైరా, న్యూస్‌టుడే: డీసీసీ కార్యదర్శిగా నియమితులైన గొల్లపూడికి చెందిన మిట్టపల్లి సతీష్‌ను సోమవారం క్యాంపు కార్యాలయంలో సత్కరించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. సర్పంచి మేడూరి రామారావు, దొడ్డా పుల్లయ్య, మచ్చా బుజ్జి పాల్గొన్నారు.

గుంతల పురం

మండలంలోని పలు రహదారులు గుంతలమయంగా మారాయి. చిన్నవానకే ఆయా గుంతల్లో నీరు చేరి వాహనదారులకు నరకప్రాయంగా మారింది. సిరిపురం, స్నానాలలక్ష్మీపురం, గండగలపాడు గ్రామాల సమీపంలో గుంతలతో రవాణాకు తీవ్ర అసౌకర్యంగా మారింది. మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వైరా

చేతిపంపు ఎత్తు పెంచరూ..!

తల్లాడ మండలం కొడవటిమెట్ల గ్రామం నుంచి నారాయణపురం గ్రామానికి వచ్చే రహదారిలోని ముత్యాలమ్మ దేవాలయం ఎదుట ఉన్న చేతిపంపు వద్ద తాగునీటిని పట్టుకునేందుకు వీలు లేకుండా ఇదిగో ఇలా ఉంది. ఈ మార్గంలో రాకపోకలు చేసేవారు, ముత్యాలమ్మ దేవాలయం వద్దకు వచ్చే భక్తులు చేతిపంపు వద్ద నీరు పట్టుకునేందుకు వీలు లేకుండా ఉంది. దీని ఎత్తు పెంచి తాగునీరు పట్టుకునేలా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ పరిస్థితిపై సర్పంచి మోదుగు తిరుమలరావును 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ ఇందుకు అవసరమైన పరికరాలను తెప్పించామని, వారం రోజుల్లో మరమ్మతులు చేపడతామన్నారు. – తల్లాడ, న్యూస్‌టుడే

ట్రేల ప్రహరీ తెలుసా?

ఖాళీగా ఓ మూలన ఉన్న ట్రేలను చూసి రైతుకు వినూత్న ఆలోచన వచ్చింది. వాటిని ఒక చోట వేయడం వల్ల ఎలుకల బెడద పెరిగింది. దాని నుంచి తప్పించుకునేందుకు అమ్మపాలేనికి చెందిన కిలారు కిరణ్ సృజనాత్మకంగా ఆలోచించారు. ఇంటి వెనక పెరటి తోటలో కూరగాయల సాగు చేస్తున్నారు. కోళ్లు ఇంట్లోకి రాకుండా, కూరగాయాల సాగుకు అడ్డుగా ట్రేలను వరుస క్రమంలో ప్రహరీలా ఏర్పాటు చేశారు.
– న్యూస్‌టుడే, కొణిజర్ల

వాకింగ్ ట్రాక్‌కు స్థలం కేటాయించాలి

వైరా, న్యూస్‌టుడే: మున్సిపాలిటీ వాసుల సౌకర్యార్థం వాకింగ్‌ట్రాక్‌కు స్థలం కేటాయించాలని కోరుతూ పుర ఛైర్‌పర్సన్ కాపా చంద్రకళ ప్రజావాణిలో భాగంగా అధికారులకు సోమవారం వినతిపత్రం అందించారు. కాపా మురళీకృష్ణ, శ్యాంబాబు, బిక్యా నాయక్ పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

మధిర, న్యూస్‌టుడే: మధిర పురపాలక సంఘంలోని 15, 16 వార్డుల్లో సోమవారం స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ నిర్వహించారు. 15వ వార్డులో కౌన్సిలర్ నరికికంటి రాజేశ్వరి, తలుపుల వెంకటేశ్వర్లు, గోవింద్ పాల్గొన్నారు. 16వ వార్డులో కౌన్సిలర్ వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో స్మార్ట్ కార్డుల పంపిణీ నిర్వహించారు.

నేడు కాంగ్రెస్ నిరసన ర్యాలీ

మధిర, న్యూస్‌టుడే: లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై దురుద్దేశ పూర్వకంగా నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌కు వ్యతిరేకంగా ఉత్తరాఖండ్‌లో భాజపా కార్యకర్తలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మధిర పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ప్రయాణికుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

మధిర పట్టణం, న్యూస్‌టుడే: తల్లాడ మండలం గొల్లగూడేనికి చెందిన మధు అనే వ్యక్తి ఖమ్మంలో మధిర డిపో బస్సు ఎక్కి హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో దిగిపోయాడు. తర్వాత ఫోన్ ఎక్కడో పడిపోయిందని ఆందోళన చెందుతుండగా.. కండక్టర్ ఎస్కే నాగుల్‌మీరా, డ్రైవర్ శ్రీకాంత్ బస్సులో ఫోన్ (రూ. 25 వేలు) గుర్తించి అతనికి సమాచారం చేరవేసి అప్పగించారు.

టీయూసీఐ జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

సత్తుపల్లి: ఖమ్మంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 6న జరిగే టీయూసీఐ జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి అమర్లపూడి శరత్ పిలుపునిచ్చారు. స్థానిక సింగరేణి క్వార్టర్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. దేశంలో కార్మికవర్గ పరిస్థితులు రోజురోజుకూ దిగజారుతున్నాయని పేర్కొన్నారు. పనికి తగిన వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సంబంధిత గోడపత్రాలను ఆవిష్కరించారు.

వీఎం బంజర్ ఎస్సైగా షాకీర్ బాధ్యతల స్వీకరణ

పెనుబల్లి: వీఎం బంజర్ ఎస్సైగా షాకీర్ సోమవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఆయన మహబూబాబాద్ నుంచి బదిలీపై వచ్చారు. గంజాయి, కోడిపందాలు, జూదం ఆడుతున్న వారి సమాచారం ఇచ్చి పోలీసులకు సహకరించాలని కోరారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద పుర కార్మికుల నిరసన

కల్లూరు, న్యూస్‌టుడే: కల్లూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద పుర కార్మికులు తమకు వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేము రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. తొమ్మిది నెలల వేతన బకాయిలు చెల్లించకపోతే సెప్టెంబరు 16 నుంచి సంపూర్ణ సమ్మె బాట తప్పదని హెచ్చరించాడు. సబ్ కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించారు. కృష్ణమూర్తి, వజీర్‌మీయా, ప్రకాష్, మణి రాజు, అంజలి, యశోద, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుపై మోదీ ఫొటో ఉండాలి: భాజపా

వేంసూరు, న్యూస్‌టుడే: నూతన రేషన్ కార్డులపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఫొటో ఉండాలని భాజపా జిల్లా కార్యదర్శి పాలా నాగసురేంద్రరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మర్లపాడులో సోమవారం గొర్ల ప్రభాకరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

మాదకద్రవ్యాల వాడకంతో భవిష్యత్తు నాశనం

కొణిజర్ల: మాదకద్రవ్యాల వాడకంతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని శ్రీరక్ష ఆసుపత్రి వైద్యుడు గోంగూర వెంకటేశ్వర్లు, మెడికల్ సూపరింటెండెంట్ ఏడుకొండలు పేర్కొన్నారు. సింగరాయపాలెం ఉన్నత పాఠశాలలో నషాముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ముసాయిదా జాబితాలో లోపాలను సరిచేయాలి

కొణిజర్ల: వైరా పుర పరిధి లాలాపురంలోని సర్ ప్రక్రియలో విడుదల చేసిన ముసాయిదా జాబితాలో లోపాలను సరిచేయాలని కోరుతూ స్థానికులు గ్రీవెన్స్‌లో మండల అధికారులకు, ఆ తర్వాత కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యుల ఓట్లు వివిధ పోలింగ్ కేంద్రాల్లో అస్తవ్యస్తంగా ఉన్నాయని, గ్రామంలో లేని వారి ఓట్లనూ ఇక్కడే ఉంచారని తెలిపారు.

డీజే శబ్దాలు నియంత్రించండి

చింతకాని, న్యూస్‌టుడే: అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా డీజే శబ్దాలు, పాటలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ చింతకాని మండలం లచ్చగూడేనికి చెందిన బోజెడ్ల మంగ సత్యవతి ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు. మండల వ్యాప్తంగా డీజేలను నియంత్రించాలని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

'లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి'

మాట్లాడుతున్న జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీనివాస్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లిలోని కోర్టు సముదాయాల ప్రాంగణంలో ఈనెల 12న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసుల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా ఆరో అదనపు న్యాయమూర్తి ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. కోర్టు ప్రాంగణంలో సోమవారం పోలీసులు, అడ్వకేట్లు, బ్యాంక్ అధికారులు, ఫైనాన్స్ నిర్వాహకులతో సోమవారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ కాదగిన కేసుల్లోని ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించాలని, లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలన్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.కె.మీరా ఖాసీంసాహెబ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి బీఎస్ఎన్ సుమబాల, అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి వి. లావణ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.రవి, పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

మధిర పట్టణం, న్యూస్‌టుడే: మధిర కోర్టులో సెప్టెంబరు 12న నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని న్యాయమూర్తి దీప్తి వేముల పిలుపునిచ్చారు. మధిర కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు, అధికారులతో సన్నాహక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పెండింగ్ కేసుల రాజీకి అవకాశం ఉన్నవాటిని ఇరుపక్షాల సమ్మతితో పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో వైరా ఏసీపీ సారంగపాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చావలి రామరాజు, వాసంశెట్టి కోటేశ్వరరావు, జ్ఞానేష్, ఏపీపీ జన్ను భద్రయ్య, మాధురి పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలపై 'బాకీ కార్డు'తో పోరుబాట: సండ్ర

బాకీ కార్డులను ప్రదర్శిస్తున్న సండ్ర వెంకటవీరయ్య, నాయకులు

పెనుబల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, వాటిని ప్రజలకు వివరించేందుకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ 'బాకీ కార్డు'లను ఇంటింటికీ అందించాలని సూచించారు. వీఎం బంజర్‌లో సోమవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి భారాస నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో సుమారు 60వేల కుటుంబాలను కలిసి బాకీ కార్డులు అందించాలని సూచించారు. రైతుభరోసా, రూ. 2లక్షల రుణమాఫీ, రైతుబోనస్, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ. 2500, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ. 4వేల పింఛను, కల్యాణలక్ష్మి, విద్యాభరోసా, ఆటోడ్రైవర్లకు రూ. 12వేలు వంటి హామీలు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. యూరియా కోసం రైతులు క్యూలో నిలబడాల్సిన దుస్థితి నెలకొందని ఆరోపించారు. ధరణి స్థానంలో భూభారతి తెచ్చి రైతుల భూసమస్యలను మరింత సంక్లిష్టం చేశారని విమర్శించారు. మాజీ ఎంపీపీ లక్కినేని అలేఖ్య, దొడ్డా శ్రీనివాసరావు, కట్టా అజయ్‌కుమార్, చెక్కిలాల లక్ష్మణరావు, వెంకట్రావు, భారాస సర్పంచులు పాల్గొన్నారు.

సత్తుపల్లి: స్థానిక కృషి బైపాస్ రోడ్డులో పునఃప్రతిష్ఠ చేసిన ముత్యాలమ్మను, పోతురాజు విగ్రహాలను సండ్ర వెంకటవీరయ్య సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రేజర్ల ఎస్సీ కాలనీలో ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠలోనూ పాల్గొన్నారు. ఆయనతో పాటు పుర మాజీ ఛైర్మన్ కూసంపూడి మహేశ్, ప్రభాకర్‌రావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

వైరాలో నినాదాలు చేస్తున్న ఆర్‌జేసీ కృష్ణ, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

వైరా, న్యూస్‌టుడే: వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ ఘోర వైఫల్యం చెందిందని భారాస నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్‌జేసీ కృష్ణ, మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి పేర్కొన్నారు. స్థానిక ఓ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, లకావత్ గిరిబాబు, మనీషాలక్ష్మి, బాణాల వెంకటేశ్వర్లు, విశ్వేశ్వరరావు, రవి, పాల్గొన్నారు.

ఎర్రుపాలెం: ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని భారాస మధిర నియోజకవర్గ ఇన్‌ఛార్జి లింగాల కమల్‌రాజు ఆరోపించారు. సెప్టెంబర్ 2 నుంచి 8వరకు చేపట్టనున్న నిరసనలపై ఎర్రుపాలెంలో సోమవారం మండల కమిటీ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఎస్.కవిత, వై.శ్రీనివాసరెడ్డి, ఎస్.రామకోటారెడ్డి, వి.బెంజిమెన్, కె.శ్రీనివాసరావు, జి.రమణారెడ్డి, ఎస్.శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి

కల్లూరు, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డివిజన్ ప్రజలకు సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్ సూచించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో విద్యుత్, భూసమస్యలు తదితరాలపై పలువురు ఆయనకు వినతి పత్రాలను అందించారు. వాటిపై దరఖాస్తు దారుల వద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి ఆయా శాఖలకు ఫిర్యాదులను పంపించారు. గతంలో ఫిర్యాదులు ఇచ్చిన అన్ని శాఖల వద్ద నుంచి సమాధానాలను తెప్పించుకుని సమస్యల పరిష్కారాలను, సమాధానాలను దరఖాస్తుదారులకు అందిస్తామని తెలిపారు.

చింతకాని, న్యూస్‌టుడే: ప్రభుత్వమే పెసలు కొనుగోలు చేయాలని కోరుతూ చింతకాని మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావుకు భారాస నాయకులు వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం పెసర కోతలు జరుగుతున్నాయని.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేయాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. గురిజాల హనుమంతరావు, వంకాయలపాటి సత్యనారాయణ, కొల్లి బాబు పాల్గొన్నారు.

ముదిగొండ, న్యూస్‌టుడే: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఐదు దరఖాస్తులు, ర.భ.శాఖకు సంబంధించి ఒక దరఖాస్తు, విద్యుత్తు శాఖకు సంబంధించి ఒకటి మొత్తం ఏడు దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీఓ విజయ తెలిపారు.

కల్లూరులో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న అజయ్‌యాదవ్

గేటు సమస్యతో నిలిచిన రైలు

కారేపల్లి, న్యూస్‌టుడే: కొత్తగూడెం నుంచి కారేపల్లి మీదుగా బొగ్గు లోడుతో ఉన్న గూడ్స్ రైలు డోర్నకల్ వైపు సోమవారం వెళుతూ గేటు సమస్యతో నిలిచింది. కారేపల్లి ఇల్లెందు రైల్వేగేటును మూసే సమయంలో సాంకేతిక సమస్య తలెత్తింది. గేటు మూసుకోకపోవడంతో రైలుకు సిగ్నల్ అందలేదు. దీంతో రైలు గేటుకు కొద్దిదూరంలో నిలిచిపోయింది. సమాచారాన్ని స్థానిక రైల్వేస్టేషన్‌కు అందించడంతో టెక్నీషియన్ వచ్చి సమస్యను పరిష్కరించారు. అప్పటికే రైలుతో పాటు రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

మున్నూరు కాపు మహిళా కమిటీల ఎన్నిక

పట్టణ, మండల మహిళా కమిటీలతో మున్నూరు కాపు సంఘం బాధ్యులు

మధిర పట్టణం, న్యూస్‌టుడే: మున్నూరు కాపు మహిళా పట్టణ, మండల నూతన కమిటీలను నియోజకవర్గ అధ్యక్షుడు ఆళ్ల కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం మధిరలో ఎన్నుకున్నారు. పట్టణ మహిళా అధ్యక్షురాలిగా వేముల శ్రీదేవి, ఉపాధ్యక్షురాలిగా మందడపు వెంకటరావమ్మ, ప్రధాన కార్యదర్శిగా పగడాల శంకరమ్మ, కోశాధికారిగా పుప్పాల పద్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా హనుమంతుల వనిత, మండల అధ్యక్షురాలిగా తోట దీపకళ, ఉపాధ్యక్షురాలిగా ఆళ్ల సుష్మ, ప్రధాన కార్యదర్శిగా కొట్టే విజయలక్ష్మి, కోశాధికారిగా వట్టివేళ్ల త్రివేణి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామిశెట్టి రజనిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగేంద్ర శ్రీనివాసరావు, దేవిశెట్టి కృష్ణ, చిరంజీవి, వైవీ అప్పారావు పాల్గొన్నారు.

నిర్వహణ మాయాజాలం..?

తనికెళ్ల వద్ద రహదారి పక్కన గ్రావెల్ పోయడంతో ప్రమాదకరంగా మారిందిలా..

కొణిజర్ల, న్యూస్‌టుడే

గుత్తేదార్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో ఆ రహదారిపై ప్రయాణించే సామాన్య ప్రజలు అవస్థలు పడుతున్నారు. తనికెళ్ల నుంచి గణేశ్వరం వరకు వేసిన రహదారి వాహనదారుల సహనానికి పరీక్ష పెడుతోంది. రహదారి భద్రత కోసం చేయాల్సిన మెయింటినెన్స్ పనులు నామమాత్రంగా చేస్తుండటంతో నిధులు పక్కదారి పడుతున్నాయి. ఇరువైపులా నాణ్యతలేని మట్టిపోయడం వల్ల వాహనదారులు జారి కిందపడుతూ క్షతగాత్రులవుతున్నారు. చిన్నపాటి వర్షానికే దారంతా బురదమయంగా మారడంతో అవస్థలు తప్పడం లేదు. ప్రయాణికులకు రక్షణగా ఉండాల్సిన రహదారి అంచుల భాగం నాసిరకమైన గ్రావెల్ పోయడంతో ప్రమాదకరంగా మారింది.

ఇవేం పనులు.. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద తనికెళ్ల నుంచి గణేశ్వరం వరకు బీటీ రహదారి నిర్మాణం ఐదేళ్ల క్రితం నిర్మించారు. రహదారి నిర్మాణం తర్వాత మెయింటినెన్స్ కింద సంబంధిత గుత్తేదారుకు కొన్నేళ్ల వరకు కాలపరిమితి ఉంటుంది. దానికి సంబంధించి అప్పుడప్పుడు మెయింటినెన్స్ కింద రహదారి కోతకు గురైన దగ్గర గ్రావెల్ పోయడం, జంగిల్ క్లియరెన్స్ చేయడం వంటి పనులు చేపడతారు.

★ ఇటీవల రహదారి నిర్వహణలో భాగంగా ఇరువైపులా నాసిరకమైన గ్రావెల్ పోశారు. అందులోనూ వర్షాలు పడటంతో రహదారి పక్కకు దిగాలంటే వాహనదారులు వణికిపోతున్నారు.

★ తనికెళ్ల ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు నాగమణి అలా రహదారి కిందకు దిగి ద్విచక్ర వాహనం జారడంతో గాయాలయ్యాయి.

★ రహదారి పక్కన ఉన్న ముళ్లకంపలు, పొదలను తొలగించాల్సి ఉన్నా మమ అనిపించారు.

★ ఎదురెదురుగా వచ్చే వాహనాలకు దారిచ్చే క్రమంలో పక్కకు దిగిన ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మట్టి వర్షానికి కరిగిపోయి బురదమయంగా మారడంతో గుంతలు ఏర్పడ్డాయి.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

పెనుబల్లి, న్యూస్‌టుడే: పెనుబల్లికి చెందిన కట్టముడి భారతమ్మ(60) సోమవారం పాముకాటుకు గురై మృతి చెందారు. అనారోగ్యంతో ఇంట్లో ఉన్న భారతమ్మను తాచు పాము కరవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే పెనుబల్లి వైద్యశాలకు తరలిస్తుండగానే ఆమె మృతి చెందింది. కాటు వేసిన పామును స్థానికులు చంపేశారు.

ద్విచక్ర వాహనం నుంచి పడి మహిళకు గాయాలు

మధిర గ్రామీణం: దెందుకూరు వంతెనపై ద్విచక్ర వాహనం జారి పడిపోవడంతో దానిపై ప్రయాణిస్తున్న మహిళ తలకుగాయాలయ్యాయి. ఏపీలోని నందిగామ మండలం జోన్నలగడ్డ గ్రామానికి చెందిన వారు ద్విచక్ర వాహనంపై సోమవారం ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మహిళకు మధిరలో చికిత్స అందించారు.

(c) eenadu

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

విచారణ వేగవంతం చేయాలి: కమిషనర్

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: సర్ ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న ఓటర్ల విచారణను వేగవంతం చేయాలని కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా పోలింగ్ కేంద్రాల వారీగా నిర్వహిస్తున్న విచారణ విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విచారణలో ఎదురవుతున్న ప్రతికూలతలను ఎలా పరిష్కరిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

కడవెండికి దిల్లీ ప్రభుత్వ ఆహ్వానం

ఖమ్మం సాంస్కృతికం: దిల్లీ ప్రభుత్వం నుంచి తనకు ఆహ్వానం ఎకో-క్లబ్ ఎన్విరాన్‌మెంటల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కడవెండి వేణుగోపాల్‌కు ఆహ్వానం అందింది. సోమవారం ఉత్తర్వులు వచ్చినట్లు వేణుగోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. న్యూదిల్లీలోని సెక్రటేరియట్‌లో రాష్ట్ర పర్యావరణ, అటవీ, వన్యప్రాణుల శాఖ మంత్రి సర్దార్ మంజీందార్ సింగ్ సిర్సాతో ఈ నెల 3న మధ్యాహ్నం 2గంటలకు సమావేశం కానున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 93944 50199
80085 52623
పాలేరు: 80085 73661
ఏదులాపురం: 96668 66875

సమస్య: గరిడేపల్లి గ్రామంలో వీధి కుక్కల స్వైరవిహారంతో భయభ్రాంతులకు గురి కావాల్సి వస్తోంది. పంచాయతీ అధికారులు స్పందించి నివారించాలి. - **స్థానికుడు**

సమాధానం: గ్రామంలో కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకుంటాం. **కంసిలి, సర్పంచి,**
– కామేపల్లి, న్యూస్‌టుడే

ఎన్ఎస్‌టీ రోడ్డులోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు. -**పాఠకుడు.**
✔ మరమ్మతులు చేయించి, పునరుద్ధరిస్తాం. - **నవ్యజ్యోతి, డీఈఈ**
– ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

గౌడ సంక్షేమ భవన నిర్మాణానికి భూమిపూజ

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రం రఘునాథపాలెంలో 30కుంటల స్థలంలో రూ.5కోట్లతో నిర్మించనున్న గౌడ సంక్షేమ భవన్(కమ్యూనిటీ హాల్)కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భూమిపూజ చేసి సోమవారం నిర్మాణ పనులను ప్రారంభించారు. సభలో మంత్రి తుమ్మల, పలువురు వక్తలు ప్రసంగించారు. సంఘానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులతోపాటు గోపా జిల్లా అధ్యక్షుడు బొల్లికొండ శ్రీనివాసరావు గౌడ్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి నెహ్రూగౌడ్, ప్రధాన కార్యదర్శి మార్కం లింగయ్య గౌడ్, బండి నాగేశ్వరరావు, బిచ్చాల తిరుమలరావు, బోయినపల్లి లక్ష్మణ్, ఊడుగు రమేశ్, రడం సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ కార్యక్రమంలో మంత్రి తుమ్మల, సంఘ నాయకులు

జలుబు.. దగ్గు.. జ్వరం..!

ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే

వాతావరణంలో మార్పులు, వర్షాల ప్రభావంతో జలుబు, తుమ్ములు, జ్వరం, స్వల్ప దగ్గు, తలనొప్పి వంటి లక్షణాలతో బాధపడుతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఆగస్టు నెలలో ఖమ్మం సర్వజనాసుపత్రికి వచ్చిన రోగుల సంఖ్యను పరిశీలిస్తే నెల పొడవునా రద్దీ అధికంగానే కొనసాగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వైరల్ జ్వరాలతోపాటు చాలా మందిలో ఫ్లూ లక్షణాలు కన్పిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. తొలి పదిరోజుల గణాంకాలతో పోలిస్తే నెలాఖరులో రోగుల సంఖ్య అధికంగా ఉండటం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. ఓపీలో సాధారణ, పిల్లల విభాగాల్లోనే అత్యధికంగా చికిత్సలు పొందారు.

జీఎంలో భారీ రద్దీ

జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్ విభాగాలకు అధిక సంఖ్యలో రోగులు వచ్చారు. జనరల్ మెడిసిన్‌లో 8219 మంది ఓపీ రోగులు, 1375 మంది ఇన్‌పేషంట్లు నమోదయ్యారు. వీరిలో 30 శాతం మంది సీజనల్ సమస్యలను ఎదుర్కొన్న వారే. పీడియాట్రిక్ విభాగంలో 4536 మంది చిన్నారులు ఓపీ సేవలు పొందగా, 856 మంది ఇన్‌పేషంట్లుగా చేరారు. 20 శాతం మంది జలుబు, జ్వరంతో బాధపడ్డవారే.

నగరంలో పొంచి ఉన్న డెంగీ ముప్పు

ఒక్క ఆగస్టు నెలలో 14 కేసులు

ఆసుపత్రిలో జనవరి నుంచి జులై వరకు తక్కువ సంఖ్యలోనే నమోదైన డెంగీ కేసులు ఆగస్టులో పెరిగాయి. ఈ ఏడాది ఇప్పటివరకు 25 కేసులు నమోదయ్యాయి. వాటిలో జూన్‌లో రెండు, జులైలో ఆరు ఉండగా, ఒక్క ఆగస్టులోనే 14 డెంగీ కేసులు వెలుగులోకి రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో డెంగీ ముప్పు కూడా పొంచి ఉందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

గత నెలలో ఓపీ సేవలు ఇలా	
1 నుంచి 10వరకు	10,992
11 నుంచి 20	11,538
21 నుంచి 31	12,493

వాతావరణ మార్పులే కారణం

ఒక్కసారిగా వర్షాలు పడటం, ఎండలు-చల్లని వాతావరణం మారుతూ ఉండటం వల్ల వైరల్ ఇన్‌ఫెక్షన్లతోపాటు ఫ్లూ వేగంగా వ్యాపించే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్షలు చేయించుకోవడం అవసరమని పేర్కొంటున్నారు. చిన్నారులు, వృద్ధులు జ్వరం, జలుబు, తుమ్ములతో బాధపడుతుంటే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

మనస్తాపంతో బలవన్మరణం

నేలకొండపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ, తీవ్ర మనోవేదనకు గురవుతున్న వ్యక్తి బలవన్మరణం చెందాడు. మంగ్రాజుపల్లి కొత్తూరుకు చెందిన అలగడప వెంకటేశ్వర్లు(55) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనోవేదనతో ఇంట్లోనే ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని బలవన్మరణం పొందాడు. కుటుంబ సభ్యులు ఇంటికి వచ్చి చూసే సరికి వెంకటేశ్వర్లు చనిపోయినట్లు గుర్తించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిపై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్ కథనం ప్రకారం.. ఆరోగ్యం బాగాలేకపోవటంతో పువ్వాడనగర్‌లో నివసించే ధనాలకోట హరిప్రసాద్(50)ను సోమవారం తెల్లవారుజామున ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారంటూ ఆయన భార్య లక్ష్మి బంధువులకు సమాచారం అందించింది. హరిప్రసాద్ మృతిపై అనుమానాలున్నాయంటూ మేనల్లుడు రాచర్ల రణధీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో చోరీ

నేలకొండపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నేలకొండపల్లిలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. కార్యాలయానికి సోమవారం వచ్చిన అధికారులు, బ్యాటరీలకు ఉన్న కాపర్ తీగలు, కాపర్ ప్లేట్లు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సొత్తు విలువ రూ.20 వేలు ఉంటుందని సమాచారం. ఎస్సై శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు.

బాలిక అదృశ్యం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: నగరానికి చెందిన ఓ బాలిక కనిపించకుండా పోయిందని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు విచారణ చేపట్టినట్లు ఖమ్మం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ తెలిపారు.

టేకు చెట్ల నరికివేతపై ఫిర్యాదు

కూసుమంచి: ఎర్రగడ్డతండా పాఠశాల ఆవరణలోని టేకుచెట్లను నరికిన ఘటనకు సంబంధించి గ్రామస్థులు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. పాఠశాల ఆవరణలో టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలనే కారణంతో 30 ఏళ్లుగా పెరుగుతున్న నాలుగు విలువైన టేకు చెట్లను కోయించినట్లు డీఎఫ్‌వో భవానిశంకర్‌కు, ఎంఈవో వీరస్వామికి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. భాజపా, భారాస నాయకులు హట్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్నీ తెరిచే ఉన్నాయి

కస్బాబజార్‌లో వస్త్ర దుకాణం సమీపాన ఓ చిన్న గల్లీ ఇది. అందులో డ్రైనేజీకి నాలుగు మాన్‌హోల్స్ ఏర్పాటు చేశారు. ఆ నాలుగులో మూడు తెరిచే ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు, పాదచారుల రాకపోకలతో నిత్యం సందడిగా ఉండే గల్లీలో అడుగడుగునా ప్రమాదం పొంచి ఉంది. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రాణాలు గాలిలో కలవడం ఖాయం. స్థానికులు రాత్రి వేళలు, బయటకు వెళ్లడానికి ఆందోళన చెందుతున్నారు.
– ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే

మురుగులో మంచినీటి వాల్వ్

మంచినీటి ట్యాంకు వద్ద మురుగులోనే వాల్వ్ ఉంది. నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న తాగునీటి ట్యాంకు వద్ద వాల్వ్ చుట్టూ గుంతను తీసి ఉంచడంతో నిత్యం గుంతలో నీరు నిల్వ ఉంటున్నాయి. రోజుల తరబడి మురుగు అలానే ఉంటుంది. పరిసరాలు దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. – నేలకొండపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

నిరుపయోగానికి నాలుగేళ్లు..!

ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్‌లో నాలుగేళ్లుగా నిరుపయోగంగా ఉన్న బ్యాటరీ వాహనాల దుస్థితి ఇది. రూ.లక్షలు వెచ్చించి పర్యాటక శాఖ కొనుగోలు చేసిన నాటినుంచి వినియోగించిన పాపాన పోలేదు. తిప్పుతారన్న ఆశకూడా లేదు. ప్రస్తుతం ట్యాంక్‌బండ్‌లోని అద్దాల గదిలో మూలన వేశారు. – ఈనాడు, ఖమ్మం

మూణ్నాళ్ల ముచ్చటేనా

లకారం ట్యాంక్‌బండ్ ఆవరణలో పర్యాటకుల కోసం ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. మున్సిపల్ కార్పొరేషన్, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ప్లాంటు పని చేయటం లేదు. నల్లాలు విరిగిపోతున్నాయి. గదికి తాళం తీయక నెలలు గడిచిందని నిర్వహణ లేక నిరుపయోగంగా మారిందని పర్యాటకులు వాపోతున్నారు. – ఈనాడు, ఖమ్మం

డీఆర్‌ఓకు ఏఓగా అదనపు బాధ్యతలు

రామమూర్తి

ఖమ్మం కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ) సీహెచ్ రామమూర్తికి కలెక్టరేట్ పరిపాలన అధికారి (ఏఓ)గా అదనపు బాధ్యతలను కలెక్టర్ దివాకర అప్పగించారు. ఏఓగా పనిచేస్తున్న కారుమంచి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ చేయటంతో డీఆర్‌ఓకు అదనపు బాధ్యతలు అప్పగించారు. సర్ ప్రక్రియ ముగిసే వరకు తహసీల్దార్లను బదిలీ చేయటం సాధ్యం కానందున తాత్కాలికంగా డీఆర్‌ఓకు ఏఓ బాధ్యతలు ఇచ్చినట్లు తెలిసింది. అక్టోబరు 19న తుది ఓటర్ల జాబితా ప్రకటించిన తర్వాత సర్ ప్రక్రియ ముగుస్తుంది.

ఎంబీఏలో నేటి నుంచి స్పాట్ ప్రవేశాలు

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎంబీఏలో చేరదలచిన విద్యార్థులకు నేటి నుంచి మూడు రోజుల పాటు స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.గోపి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐసెట్-2026 ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు వివిధ కేటగిరీల వారీగా మొత్తం 21 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. వివరాలకు ఫోన్ నెంబర్లు- 94406 52571 లేదా 99122 63863ను సంప్రదించాలని సూచించారు.

బిల్లులు చెల్లించాలని నిరసన

నేలకొండపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: తమకు రావాల్సిన బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు, మాజీ ప్రజాప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. నేలకొండపల్లి పంచాయతీలో గత పాలకవర్గంలో సుమారు రూ.కోటితో అభివృద్ధి పనులు చేసినట్టు గుత్తేదారులు పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ శీలం వెంకటలక్ష్మీ, కార్యదర్శి సంపత్ దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా బిల్లులను ఇవ్వాలని పట్టుబట్టారు. సర్పంచ్ వెంకటలక్ష్మీ మాట్లాడుతూ పాలకవర్గంలో చర్చించి బిల్లులు చెల్లించేలా చూస్తామన్నారు. ఉప సర్పంచ్ మద్దినేని మహేష్ పాల్గొన్నారు.

'హామీల అమలులో విఫలం'

కామేపల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ విమర్శించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై చేపట్టాల్సిన నిరసన కార్యక్రమాలకు సంబంధించి కొత్తలింగాలలో భారాస ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సోమవారం నిర్వహించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కామేపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఎంఈవో వెంకట్ అన్నారు. కొత్తలింగాల భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల గల విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలను సోమవారం నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. సర్పంచి ఇట్టా శ్రీనివాసరావు, హెచ్ఎం. మాలిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'భారాస పోరుబాటకు తరలిరండి'

ఖమ్మం బుర్హాన్‌పురం: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఈ నెల 2నుంచి భారాస చేపట్టిన పోరుబాట కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. 8వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలుపుకోవటంలో విఫలమైందన్నారు.

'భాజపా తీరు అప్రజాస్వామికం'

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై ఉత్తరాఖండ్‌లో నమోదు చేసిన ఎఫ్ఐఆర్ అప్రజాస్వామికమని ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షుడు నాగండ్ల దీపక్‌చౌదరి ఓ ప్రకటనలో ఖండించారు. భాజపా తీరును నిరసిస్తూ నేడు(మంగళవారం) ఉదయం 10.30గంటలకు జిల్లా పార్టీ కార్యాలయం నుంచి జడ్పీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

దిల్లీకి తరలిన సీపీఐ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: సీపీఐ జాతీయ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 1న దిల్లీలో చేపట్టిన 'బద్లావ్ జరూరీ హై' భారీ ప్రదర్శన, బహిరంగ సభకు సోమవారం ఉదయం జిల్లా నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. రెండు రోజులుగా ప్రత్యేక రైళ్లలో వందలాది మంది కార్యకర్తలు దిల్లీకి వెళ్లారని పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు తెలిపారు.

ప్రత్యేక అవసరాల బాలబాలికలకు క్రీడా పోటీలు

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: దివ్యాంగ విద్యార్థులు, ప్రత్యేక అవసరాల బాలబాలికలకు మండల స్థాయి క్రీడా పోటీలను రఘునాథపాలెం భవిత కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఎంఈవో బి.రాములు ఆధ్వర్యంలో వారికి పరుగు పందెం, కుర్చీ ఆటలు, కప్పగంతులు, డ్రాయింగ్, క్యారమ్స్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సర్పంచి గాజుల కృష్ణారావు, హెచ్ఎం రాధారుక్మిణి, భవిత కేంద్రం ఉపాధ్యాయుడు ఎస్.హుస్సేన్ పాల్గొన్నారు.

విజేతకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎంఈఓ రాములు

కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ

మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్ ఏఎల్ఎన్ శాస్త్రి

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: డిగ్రీ విద్యార్థినులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువుతోపాటు సాఫ్ట్‌స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలని ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏఎల్ఎన్ శాస్త్రి అన్నారు. కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో లాంచ్ గర్ల్స్ సంస్థ సోమవారం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రియాంక, లహరి మాట్లాడారు. అధ్యాపకులు ఉదయలక్ష్మి, కవిత, కోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం అప్రమత్తమై నియంత్రణ చర్యలు చేపట్టాలనీ పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని ఎన్డీ జిల్లా కార్యాలయంలో సోమవారం పీవైఎల్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్య రంగంలో నెలకొన్న సమస్యలు, గంజాయి, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నియంత్రణపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. పాలకులు ప్రభుత్వ వైద్యాన్ని నిర్వీర్యం చేస్తూ ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులను ప్రోత్సహిస్తూ ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వాసుపత్రుల్లో మౌలిక వసతులు కల్పించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేశ్, ఉపాధ్యక్షుడు తుడుం వీరభద్రం, సహాయ కార్యదర్శి పర్సిక రవి, కోశాధికారి దరావత్ రవి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ

'కఠిన చర్యలు తప్పవు'

తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే: గంజాయి, జూదం, డ్రగ్స్ తదితర చట్ట విరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై కూచిపూడి జగదీశ్ అన్నారు. కాకరవాయి, ముజాహిద్‌పురం, సుబ్లేడు గ్రామాల్లోని అనుమానాస్పద స్థలాలను 'నార్కోటిక్ డాగ్' సాయంతో తనిఖీ చేశారు. ఎస్సై జగదీశ్, సిబ్బంది ఎల్.వెంకటేశ్వర్లు, 'నార్కోటిక్ డాగ్' స్క్వాడ్ నరేశ్ పాల్గొన్నారు.

సామాజిక చైతన్య నాటకోత్సవాలు ప్రారంభం

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ, హైదరాబాద్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం సామాజిక చైతన్య నాటకోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, ప్రముఖ వైద్యుడు ఎంఎఫ్.గోపినాథ్ హాజరై రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. నంది అవార్డు గ్రహీత కె.దేవేంద్ర రాసిన 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం ప్రదర్శించారు. తొలుత గాయకులు ఆలపించిన అంబేడ్కర్ గీతాలు ఆకట్టుకున్నాయి. సామాజికవేత్త జీవన్, అకాడమీ అధ్యక్షుడు సిద్దోజీ, కార్యదర్శి ఎం.జగ్గారాజు, రచయిత దేవేంద్ర, ప్రజాసంఘాల నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

నాటకోత్సవాలు ప్రారంభిస్తున్న తమ్మినేని తదితరులు

విజేతలకు అభినందన

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీలు హైదరాబాదులో నిర్వహించారు. త్రివేణి హైస్కూల్ క్రీడాకారుడు సాయి శ్రీజిత్ స్వర్ణం గెల్చుకున్నాడు. సోమవారం విద్యాలయం డైరెక్టర్ డా.వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ క్రీడాకారుణ్ని అభినందించారు.

మారథాన్‌లో మెరిసి..

ఎన్ఎండీసీ హైదరాబాదులో నిర్వహించిన మారథాన్ పోటీలో ఖమ్మం న్యూవిజన్ స్కూల్ ఏడో తరగతి విద్యార్థి మిన్హా అమీరహ్ రజత పతకం సాధించింది. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన మారథాన్ పరుగులోనూ ఈ బాలికల రజతం గెల్చుకొంది. స్కూల్ యాజమాన్యం సి.హెచ్.జి.కె.ప్రసాద్, డైరెక్టర్ కార్తీక్, ప్రిన్సిపల్ మైఖేల్ బాలికను ప్రత్యేకంగా అభినందించారు.

● రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో పాల్గొన్న విన్‌ఫీల్డ్ స్కూల్ క్రీడాకారులు జి.అక్షయ, ఆర్.పావని, జి.అపూర్వ స్వర్ణ పతకాలు గెల్చుకోగా కె.లాస్య ద్వితీయ, సాత్విక్ తృతీయ బహుమతులు అందుకున్నారు. పాఠశాల యాజమాన్యం పి.శ్రీకాంత్, జి.పుల్లారావు, ఎం.కిషోర్ కుమార్ క్రీడాకారులను అభినందించారు.

ప్రొఫెసర్ వెంకటేశ్వరరెడ్డికి సన్మానం

నేలకొండపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: నేలకొండపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతిశాస్త్రం అధ్యాపకునిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన వెంకటేశ్వరరెడ్డిని సోమవారం సన్మానించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి, వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్ జాకీరుల్లా, బానోతు రెడ్డి, గోపి, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉచిత న్యాయ సహాయం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందిస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.దేవీమానస అన్నారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా జిల్లా జైలుతోపాటు, బాలల సదనాన్ని సోమవారం సందర్శించిన ఆమె అక్కడి వసతులను పరిశీలించారు. ఖైదీలు, బాలలకు అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, ఇతర అవసరాలను పరిశీలించి అధికారులనడిగి తెలుసుకున్నారు. అర్హులెవరూ ఉచిత న్యాయ సహాయానికి దూరం కాకుండా చూడాలని ఆదేశించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకువచ్చి వారికి సకాలంలో అవసరమైన న్యాయ సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రికార్డులను పరిశీలిస్తున్న కార్యదర్శి దేవీమానస

వైభవంగా సంకట హరచతుర్దశి

శ్రీబాలగణపతికి ప్రత్యేక అలంకరణ

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఇందిరానగర్ కూడలిలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర సహిత శ్రీబాలగణపతి దేవస్థానంలో సోమవారం సాయంత్రం సంకట హరచతుర్దశి పూజలు వైభవంగా నిర్వహించారు. అర్చకుడు గిరిధర్ ఆధ్వర్యంలో శ్రీబాలగణపతికి ప్రత్యేక పూజలు, అలంకరణలు, 21రకాల పళ్ల రసాలతో అభిషేకాలు జరిపారు. దాతలు కావూరి లక్ష్మీనాగపూర్ణప్రసాద్, జశ్మిత దంపతుల ఆర్థిక సహకారంతో వందలమంది భక్తులకు అల్పాహారం పంపిణీ చేశారు. ఈఓ బేబీసరోజిని, దేవాలయ వ్యవస్థాపక ఛైర్మన్ బాజిన్ని వీరయ్య, ప్రధాన కార్యదర్శి బాజిన్ని తిరుపతిరావు, సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తులను తీసుకునేవారేరి..!

కూసుమంచి, న్యూస్‌టుడే: కూసుమంచిలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదులు ఎవ్వరికి ఇవ్వాలో అర్థంకాని పరిస్థితి. ఉదయం 11 గంటల వరకు కూడా దరఖాస్తు తీసుకునే అధికారి లేకుండా పోయారు. వచ్చిన నాలుగు ఫిర్యాదులను టైపిస్ట్ స్వీకరించి అప్‌లోడ్ చేశారు. ఎంపీడీవో జశ్వంత్‌కుమార్, ఇంఛార్జి అధికారి అయిన ఎంఈవో హన్మంతరావు వ్యక్తిగత కారణాలతో సెలవులో ఉన్నారు. బాధ్యులైన సూపరింటెండెంట్ ఉదయశ్రీ 'సర్'పై బయటకు వెళ్లారు. తహసీల్దార్ సైదులు కూడా 22ఏ పనులపై కలెక్టరేట్‌లో ఉండిపోయారు. గ్రామంలో సమస్యలను ప్రస్తావించేందుకు వచ్చిన కూసుమంచి వార్డు సభ్యులు ఖాళీ కుర్చీలకు దరఖాస్తు ఇస్తూ.. నిరసన తెలిపారు.

LIC
భారతీయ జీవన బీమా నిగమ్
LIFE INSURANCE CORPORATION OF INDIA
70 సంవత్సరాల
LIC 70వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
నమ్మకమే పునాదిగా...
భద్రతే లక్ష్యంగా...
కోట్లాది కుటుంబాల భవిష్యత్తుకు అండగా నిలుస్తూ
మరెన్నో విజయవంతమైన సంవత్సరాలు కొనసాగాలని ఆకాంక్షిస్తూ...
LIC – మీ జీవితానికి భరోసా... మీ భవిష్యత్తుకు రక్షణ
లోడిగ వెంకన్న యాదవ్
(LIC వెంకన్న)
చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్-ఖమ్మం, Cell: 9848341288

యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్
సాయిరామ్ హాస్పిటల్స్
రిలయన్స్ డిజిటల్ దగ్గర, రేవతి సెంటర్, నెహ్రూనగర్, ఖమ్మం.
ఉచిత క్యాన్సర్ కన్సల్టేషన్
క్రింది వ్యాధులకు ది.01-09-2026 మంగళవారం మ.12 to 4 PM
సంప్రదించవలసిన వారు:
గర్భసంచి క్యాన్సర్, జీర్ణకోశ క్యాన్సర్, నోటి క్యాన్సర్, పోస్టేట్ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్
డా॥ గోపు భార్గవ్‌రెడ్డి
MBBS, MD, Medical Oncology
కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్
యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్
అపాయింట్‌మెంట్ కొరకు: 988 532 7301

కో-ఆపరేటివ్ అర్బన్
ది స్తంభాద్రి బ్యాంక్ లి.
E.R.R. కాంప్లెక్స్, స్టేషన్ రోడ్, ఖమ్మం - 507 001. ఫోన్: 234666, 300383
రి.నెం.27వ/మ.జ.నో/2026-27 తేది:01-09-2026

మహాజన సభ నోటీసు

ది.స్తంభాద్రి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్, ఖమ్మం 27వ సర్వసభ్య సమావేశము ది.20-09-2026 ఆదివారం ఉదయం 11:00 గంటలకు బ్యాంక్ కార్యాలయం భవనము నందు శ్రీ ఎర్నేని రామారావు, ఛైర్మన్ అధ్యక్షతన జరుపుటకు నిర్ణయించనైనది. కావున సభ్యులందరు పాల్గొనవలసినదిగా కోరుచున్నాము.

చర్చనీయాంశాలు

1. 2025-26 సంవత్సరము యొక్క బ్యాంకు 27వ వార్షిక నివేదిక ఆమోదించుట.
2. 2025-26 సంవత్సరమునకు ఆడిట్ చేయబడిన లెక్కలు పరిశీలించుట మరియు ఆమోదించుట
3. 2025-26 సంవత్సరము యొక్క బ్యాంకు ఆర్జించిన నికర లాభములను పద్దుల వారీగా పంచుట
4. 2025-26 సంవత్సరములో బడ్జెట్ మించిన ఖర్చులు ఆమోదించుట
5. 2026-27 సంవత్సరమునకు బ్యాంకు యొక్క అంచనా బడ్జెట్ ఆమోదించుట
6. 2022-23 సంవత్సరము వరకు గల అన్ క్లైమ్స్ డివిడెండ్ ది.31-12-2026 తరువాత రిజర్వ్ ఫండ్‌లో జమచేయుట గురించి.
7. 2025-26 సంవత్సరములో మంజూరు చేసిన ఋణములు పరిశీలించుట మరియు ఆమోదించుట
8. 2025-2026 సంవత్సరానికి గాను డివిడెండ్ ప్రతిపాదన ఆమోదించుట
9. 2025-2026 సంవత్సరములో నూతనముగా చేర్చుకున్న సభ్యులను మరియు వాటా ధనమును వాపసు చేసిన సభ్యులను ఆమోదించుట
10. ఛైర్మన్ వారి అనుమతితో ప్రవేశపెట్టు ఇతర విషయములు చర్చించుట.

//పాలకవర్గము అనుమతితో//

సం/- వి.సందీప్‌కుమార్
చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

సం/- ఎర్నేని రామారావు
ఛైర్మన్

(c) eenadu